

అంగళ్లు-ముదివేడు మార్గంలో అనధికారికంగా మార్చిన విద్యుత్తు లైను, ట్రాన్స్‌ఫార్మర్

తాలిబాన్ రాజ్యంలో.. విద్యుత్తు శాఖను ఊడ్చేశారు

● ట్రాన్స్‌ఫార్మర్లు ఎత్తుకెళ్లారు ● అయిన వారికి అమ్మేశారు ● విద్యుత్తు లైన్లు మార్చేశారు ● చేయని పనులకూ బిల్లులు



అంగళ్లు సమీపంలో దరఖాస్తు చేయకున్నా.. ఓ రైతు పొలంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

మదనపల్లె, జూన్ 22: మొన్నటి వరకూ పెద్దిరెడ్డి కుటుంబం ఏలుబడిలో తాలిబన్ రాజ్యంగా ఉన్న తంబళ్లపల్లెలో ఇసుక దోపిడీ, భూముల కబ్జానే కాదు.. ముఖ్యంగా విద్యుత్తు శాఖను నిర్వీర్యం చేశారు. ఆ శాఖలోని లైన్‌మెన్ నుంచి ఏఈని దాటి ఏడీఏ, డీఈ స్థాయి వరకూ అధికారులను ఉత్సవ విగ్రహాలుగా మార్చేశారు. ఎక్కడా లేని విధంగా ట్రాన్స్‌కోను సొంతం ఊడ్చేశారు. ఓ విధంగా చెప్పాలంటే ఇక్కడ పాలన, పెత్తనం అంతా పెద్దిరెడ్డి అనుచరుడిగా చెబుతున్న విద్యుత్తు కాంట్రాక్టర్‌దే సాగింది. ఆయా మండలాల్లోని ఒకరిద్దరు అధికార పార్టీ చోటా నాయకులతో కలసి పని కానిచ్చేశారు. పేరుకే కాంట్రాక్టర్ అయినా.. ఎక్కడా రైతులు, విద్యుత్తు వినియోగదారులకు సంబంధించిన పనులు తక్కువేనని చెబుతున్నారు. అధికారం మాటున ఆ శాఖలో లైన్‌మెన్ నుంచి డీఈ వరకూ అందరినీ ఉత్సవ విగ్రహాలుగా మార్చేసి రైతుల కంటే వీరే ఎక్కువగా లబ్ధి పొందారు. ప్రధానంగా విద్యుత్తు కనెక్షన్లు మంజూరు నుంచి ట్రాన్స్‌ఫార్మర్లు ఎత్తుకెళ్లడం వరకూ పైచేయి సాధించారు. మరోవైపు అధికారుల అనుమతి లేకుండా ఎక్కడపడితే అక్కడ విద్యుత్తు లైన్లు, విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు మరోచోటికి మార్చడం వరకూ రూ.లక్షల్లో వసూలు చేశారు. రైతు అనే పదంతో పని లేకుండా వైసీపీనే అర్హతగా తాము అనుకున్నవీ చేసి పెట్టారు. ప్రజాప్రతినిధి పేరు చెప్పి పనిని బట్టి ధర ఫిక్స్ చేసి వసూలు చేసినట్లు విద్యుత్తు శాఖాధికారులు, ఆ పార్టీ నేతలు, కార్యకర్తలే వాపోతున్నారు. అలాగే విద్యుత్తు వ్యవసాయ సర్వీసులకు దరఖాస్తు చేసుకున్న రైతులను కాదని, తమకు అనుకూలంగా ఉన్న, అధికార పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు, పార్టీ మద్దతుదారులుగా ఉంటున్న రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు ఇచ్చేశారు. అవసరం ఉన్నవారు, కనెక్షన్‌కు దరఖాస్తు చేసి నిరీక్షిస్తున్న రైతులను పక్కన పెట్టి, అవసరం లేని, మనోడైతే చాలన్న సూత్రాన్ని పాటిస్తూ విద్యుత్తు సామగ్రి పంచేశారు. ఫలితంగా తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఏ పల్లెకు వెళ్లినా వినియోగంలోలేని ట్రాన్స్‌ఫార్మర్లు ఊరు శివారు ప్రాంతం, వీధులు, గుడి, బడిలో ఇబ్బడిముబ్బడిగా దర్శనమిస్తున్నాయి.

ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ సర్వీసులకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర సామగ్రిని వైసీపీ ప్రభుత్వం రాగానే ఇబ్బడిముబ్బడిగా దించేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న రైతులకు అందరికీ అప్పట్లోనే సర్వీసులు మంజూరైనా వివిధ కారణాలతో మెటీరియల్ విడుదల కాలేదు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో పార్టీ పెద్దలు కాంట్రాక్టర్‌తో కుదుర్చుకున్న ఒప్పందంతో సామగ్రి డంప్ చేశారు. ఈ క్రమంలో మండలాలు, గ్రామాల్లో విద్యుత్తు మేళా పేరుతో రైతులకు విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు మెటీరియల్ పంపిణీ చేశారు. అధికార పార్టీ నేతలకు తమకు మేళ్లుగా ఎంచుకున్న కడపకు చెందిన షిర్డి సాయి ఎలక్ట్రికల్ కంపెనీ వీటిని సరఫరా చేసింది. ఇందులో భాగంగా మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో ఒక్కో మండలంలో వెయ్యి నుంచి 1500 ట్రాన్స్‌ఫార్మర్లు వచ్చాయి. ఈ స్థాయిలో రావడంలో జిల్లాలోనే రికార్డు అని ఆ శాఖాధికారులు ఆశ్చర్యపోతున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని తంబళ్లపల్లె, కురబలకోట, బి.కొత్తకోట, ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, పెద్దమండ్యం మండలాల్లోనూ టీడీపీ మద్దతుదారులుగా ముద్రపడిన రైతులను పక్కన పెట్టి..వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ఆ పార్టీకి చెందిన రైతులు అయితే చాలు..అవసరం లేకున్నా ఇచ్చేశారు.

పుంగనూరు కేంద్రంగా పనిచేస్తున్న విద్యుత్తు కాంట్రాక్టర్ పెద్దిరెడ్డి అనుచరుడు. ఆయన ఏలుబడిలోని తంబళ్లపల్లె నియోజకవర్గంలోనూ పాగా వేశారు. ఆ కాంట్రాక్టర్‌కు ఇక్కడ సంబంధం లేకపోయినా పెద్దలు చెప్పారన్న ఒకే ఒక కారణంతో అప్పటికే ఇక్కడున్న కాంట్రాక్టర్లను పక్కన పెట్టి పెత్తనం చెలాయించారు. ఒకవేళ అధికారులు చెప్పారని ఇక్కడ పనిచేసినా అడ్డుకోవడం, కార్మికులను కొట్టి పంపేశారు. ఇక ఆ కాంట్రాక్టర్‌ది, ఆయన కింద పనిచేసే వారిదే రాజ్యం అయింది. వారు చేసిందే పని, వారు లాగిందే లైను అయింది. వీరి ఆగడాలను అడ్డుకోబోయిన ఉన్నతస్థాయి అధికారి పెద్దల నుంచి బెదిరింపులు, చీత్కారాలు ఎదుర్కోలేక చివరకు బదిలీపై వెళ్లిపోయారు. ఇక్కడ పనిచేసే ఏఈలు సైతం సెలవుపై వెళ్లారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో వేల వ్యవసాయ సర్వీసులకు సంబంధించి విద్యుత్తు స్తంభాలు నాటి, వైర్లు లాగి, ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెలు నిర్మించి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. కానీ కాంట్రాక్టర్ ఎక్కడా ఆ పనులు చేయలేదు. అవసరమైన రైతులు మాత్రం వ్యయ, ప్రయాసాలకోర్చి విద్యుత్తుశాఖ సిబ్బందితోనో, ప్రైవేటు వ్యక్తులతోనో ఆ పనులు చేయించుకోగా, కాంట్రాక్టర్ బిల్లులు చేయించుకున్నారు. రైతు పనులు చేయాల్సిన కాంట్రాక్టర్.. తమకు ఆదాయాన్నిచ్చే పనులపై దృష్టి పెట్టాడు. ఇందులో భాగంగా కురబలకోట మండలంలోని అంగళ్లు, ముదివేడు ఏరియాలలో అనధికారింగా విద్యుత్తు లైన్లు మార్చేశారు. ఇక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకోవడంతో వ్యవసాయ భూములన్నీ లేఅవుట్లు, ప్లాట్లుగా మారిపోయాయి.

మూడేళ్లవుతున్నా సర్వీసు లేదు..



వ్యవసాయ సర్వీసు కోసం రూ.25 వేలు చెల్లించి మూడేళ్లు అవుతోంది. ఇద్దరు రైతులకు కలసి 25 కె.వి.ట్రాన్స్‌ఫార్మర్ పెడతామన్నారు. ఒక రైతు సర్వీసుకు దరఖాస్తు చేసుకుంటే ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు మూడు విద్యుత్తు స్తంభాలు, వైరు ఇవ్వాల్సి ఉన్నా.. మాకు ఒక పోలు మాత్రమే సరిపోతుంది. ట్రాన్స్‌కో అధికారులను అడిగితే రోజులు గడిపేస్తున్నారు. ఇక కరెంటు వాళ్లను నమ్ముకుంటే లాభం లేదని, సమీపంలోని రైతు ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్తు వాడుకుంటున్నాం.

- కె.కృష్ణమూర్తినాయుడు, రైతు, జుంజురపెంట, తంబళ్లపల్లె మండలం

దీంతో అక్కడ వెళుతున్న విద్యుత్తు లైన్లను మార్చడంలో కీలకపాత్ర పోషించారు.

సాధారణంగా విద్యుత్తు స్తంభమో, లైనో మార్చాలంటే షిఫ్టింగ్ చార్జీలు చెల్లించాల్సిన తర్వాత పనులు చేయాల్సి ఉంది. కానీ అధికారులతో ప్రమేయం లేకుండా ఎల్‌టీ లైన్లే కాదు 11 కేవీ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కూడా మార్చేశారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొట్టి తమ జేబులు నింపుకున్నారు. కొన్నిచోట్ల నామమాత్రపు చలానాతో మమ అనిపించారు. ఇందులో అధికారులు, సిబ్బందిని పావులుగా వాడుకున్నట్లు బాధితులు వాపోతున్నారు. అంగళ్లతో పాటు బి.కొత్తకోట, ములకలచెరువు, పెద్దమండ్యం ఏరియాలలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. గూగుల్ చిత్రాల ఆధారంగా క్షేత్రస్థాయిలో మార్చిన లైన్లపై విచారణ చేపడితే, ఇలాంటి అక్రమాలు భారీగా బయటపడతాయి. విద్యుత్తు మేళాలో మిగిలిన, వివిధ కారణాలతో రైతులు తీసుకెళ్లని విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లను ఎత్తుకెళ్లారు. ట్రాన్స్‌కో సిబ్బంది, అధికారులు అడ్డుకున్నా ఖాతరు చేయకుండా సబ్‌స్టేషన్ల నుంచి తీసుకెళ్లి అయిన వారికి అమ్మేశారు.

ప్రజాప్రతినిధి చెప్పారని తమపై ఒత్తిడి తెచ్చి, దౌర్జన్యం చేసి ఎత్తుకెళ్లారని ట్రాన్స్‌కో సిబ్బంది వాపోతున్నారు. ఇలా కురబలకోట, తంబళ్లపల్లె, పెద్దమండ్యం మండలాల్లో నుంచి తీసుకెళ్లి పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట మండలాల్లో అయిన వారికి ఇచ్చేశారు. మరో విడత మండలాలకు ట్రాన్స్‌ఫార్మర్స్ ఇస్తామన్నా ఆ మండలాల ఏఈలు వద్దని చెప్పారు. ఎందుకంటే వచ్చినవన్నీ ఎక్కడ ఎత్తుకెళ్లిపోతారోనని భయపడి వెనక్కి పంపినట్లు బాధితులు చెబుతున్నారు. ఇక్కడ ఆరు మండలాల్లో కూడా టీడీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు, ఆ పార్టీ మద్దతుదారులుగా ఉన్న రైతులకు మంజూరైనా ఇవ్వలేదు. వీరి ట్రాన్స్‌ఫార్మర్లను వైసీపీ వాళ్లకు ఇచ్చేశారు. సీనియారిటీ ప్రాతిపాదికన సర్వీసు, సామగ్రి ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టడమే కాదు..కొత్తగా దరఖాస్తు చేసుకున్న, అసలు దరఖాస్తు చేసుకోని వారికీ ఇచ్చేశారు. తర్వాత డబ్బులు కట్టి మంజూరు చేయించారు. ఇదే కాదు..పెద్దతిప్పసముద్రం మండలంలో తమకు కాని ముగ్గురు టీడీపీ మద్దతుదారులకు సీనియారిటీ ప్రకారం జారీ చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను వెనక్కి తేవాలని ఏఈపై తీవ్రంగా ఒత్తిడి తెచ్చారు. దీనిని భరించలేని ఏఈ సెలవుపెట్టి ఎన్నికల ఫలితాలు వచ్చాక విధుల్లో చేరారు. ఇదే పరిస్థితి అన్ని మండలాల్లోనూ ఉంది. వైసీపీ చోటా నాయకులు, ట్రాన్స్‌కో కాంట్రాక్టర్..రైతు అవసరాన్ని బట్టి ధర నిర్ణయించి రూ.50 వేల నుంచి రూ.70 వేలు వసూలు చేసినట్లు చెబుతున్నారు. ఇక్కడ అధికారి చేయాల్సిన పనంతా కాంట్రాక్టర్ చేసి పెట్టాడు. ఇక విలువైన ప్లాట్లు, లేఅవుట్లలో లైన్లు మార్చడానికి రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలు వరకూ వసూలు చేసినట్లు ఆ శాఖ వాపోతోంది.

అవసరం లేకున్నా ఇచ్చేశారు..



నాకున్న అయిదెకరాల పొలాన్ని సాగు చేయడానికి బోరు వేయించాను. డబ్బులు కట్టి వ్యవసాయ సర్వీసుకు దరఖాస్తు చేసుకున్నా. కానీ ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వలేదు. మా ఏరియాలో ఉన్న వైసీపీ నాయకులు ఎమ్మెల్యేతో ఫోన్ చేయించి నిలిపేశారు. టీడీపీ వారిమనే మాకు ఇవ్వలేదు. అదే వైసీపీ వాళ్లకు అయితే, మంజూరు కాకున్నా, అవసరం లేకున్నా, అసలు అప్లయ్ చేయకుండానే ఇచ్చినారు. సీనియారిటీ ప్రకారం రైతులకు ఇచ్చినా...అవి టీడీపీ వాళ్ల అయితే, వెనక్కి ఇప్పించుకోమని ఏఈలను ఇబ్బందులకు గురి చేశారు. నేను ఒక్కడినే బాధితుడిని కాదు..మండలంలో ఇలాంటి వారు నూరుమందికిపైనే ఉన్నారు.

- బి.వెంకటరెడ్డి, రైతు, దూలంవారిపల్లె, పెద్దతిప్పసముద్రం



పీటీఎం మండలం బూర్లపల్లెలో గుడిలో నిరుపయోగంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు



పీటీఎం మండలం కాయలవాండ్లపల్లెలో వైసీపీ నాయకుడి ఇంట్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

రెచ్చిపోతున్న వైసీపీ మట్టి మాఫియా

● ఊటుకూరు గుట్టపై మట్టి దోపిడీ ● ఎక్స్‌కవేటర్లతో యథేచ్ఛగా తవ్వకాలు
● టిప్పర్లతో అక్రమంగా మట్టి తరలింపు ● తిరగబడ్డ జనం. వాహనాలు అడ్డగింత
● హైవేపై రాస్తారోకో ● అధికారుల హామీతో ఆందోళన విరమణ

రాజంపేట, జూన్ 22: రాజంపేట ప్రాంతంలో వైసీపీ మట్టి మాఫియా దోపిడీ వ్యవహారం చిలికి చిలికి గాలివానగా మారింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు పక్షం రోజులు దాటుతున్నా వైసీపీ మట్టి మాఫియా దోపిడీ ఆగలేదు. ఐదు సంవత్సరాలుగా వైసీపీ పాలకుల అండదండలతో పార్టీకి సంబంధించిన మట్టి మాఫియా సభ్యులు రాజంపేట చుట్టుపక్కల ప్రాంతాల్లోని కొండలు, గుట్టలను, చెరువులను అడ్డంగా తవ్వేసి కోట్లాది రూపాయలకు పడగలెత్తారు. ఐదేళ్లలో వారు ఆడిందే ఆటగా, పాడిందే పాటగా ఈ మట్టి దోపిడీ వ్యవహారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగింది. వైసీపీని ఓటు అన్న ఆయుధంతో అథఃపాతాళానికి తొక్కినా వారి దోపిడీ మాత్రం ఆగడం లేదు. అప్పటి పోలీసులు, అప్పటి రెవెన్యూ అధికారులు, అప్పటి మైనింగ్ అధికారులు, విజిలెన్స్ అధికారులు, అప్పటి పంచాయతి అధికారులు ఇప్పటికీ కొనసాగుతూ ఉండడంతో ఆ అధికారుల అండదండలు చూసుకుని వారి మట్టిదోపిడీ ఆగలేదు. రాజంపేట చుట్టుపక్కల కొండలు, గుట్టలను చెరువులను ఇప్పటికీ తవ్వేస్తూ రోజువారీ లక్షలు గడిస్తున్నారు. రియల్ ఎస్టేట్ వెంచర్‌లకు, ఇతర వాడకాలకు ఈ మట్టిని సరఫరా చేసి భారీ ఎత్తున డబ్బులు సంపాదిస్తున్నారు.

తిరగబడ్డ జనం.. వాహనాలు అడ్డగింత

మట్టి మాఫియా వ్యవహారం శనివారం బట్టబయలైంది. రాజంపేట పట్టణానికి 3 కిలోమీటర్ల దూరంలో ఊటుకూరు గుట్టపై కొండ్లోపల్లె రోడ్డు వద్ద వైసీపీ మట్టి మాఫియా సుమారు 8 టిప్పర్లను, ఎక్స్‌కవేటర్‌లను ఏర్పాటు చేసుకుని కొండమట్టిని కొల్లగొడుతుండగా జనం తిరగబడ్డారు. ఆ కొండపై పూర్తి హక్కులు ఉన్న ఊటుకూరు గ్రామ ప్రజలు ఆడ మగ తేడా లేకుండా అందరై వెళ్లి మట్టి తవ్వకాలను నిలిపివేశారు. ఆ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు కర్ణాటకం చెంగల్‌రాయుడు, సీనియర్ టీడీపీ నాయకులు మలిశెట్టి సుబ్బరాయుడు, మండల టీడీపీ ఉపాధ్యక్షుడు ఆర్.సతీష్‌కుమార్‌రాజు, సాంబారు లక్ష్మీనారాయణ, గణేష్, ఊటుకూరు గ్రామం మొత్తం ఊటుకూరు గుట్ట నుంచి తరలిస్తున్న మట్టి లారీలను అడ్డుకున్నారు. వెంటనే విజిలెన్స్ అధికారులకు, రెవెన్యూ అధికారులకు, సచివాలయ అధికారులకు మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. వీరి ఫిర్యాదులను అధికారులు పెడచెవిన పెట్టడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల తీరుపై తూర్పారబట్టారు.

హైవేపై రాస్తారోకో.. పోలీసుల రంగప్రవేశం

ఊటుకూరు గ్రామ ప్రజలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కడప-చెన్నై హైవేను ఊటుకూరు గ్రామం వద్ద రాస్తారోకో చేశారు. మట్టి మాఫియాను అడ్డుకోవాలని, మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, వాహనాలను సీజ్ చేయాలని, వీరికి కొమ్ముకాస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుమారు అరగంటకు పైబడి రాస్తారోకో నిర్వహించారు. మట్టిమాఫియాపై అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వకపోతే రాస్తారోకోను విరమించబోమని హెచ్చరించారు. దీంతో హైవేపై పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. మన్నూరు సీఐ రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మట్టి తరలిస్తున్న 8 వాహనాల నెంబర్లతో సహా వివరాలను సీఐకి అందచేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెద్ద ఎత్తున రోడ్డును దిగ్బంధించడంతో కడప-చెన్నై రోడ్డుపై వాహనాలు నిలిచిపోయాయి. ఎక్కడికక్కడి వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. దీంతో విషయం తెలుసుకున్న ఊటుకూరు గ్రామ కార్యదర్శి శ్రీకాంత్, వీఆర్‌వో ఈశ్వరయ్య, డిప్యూటీ తహసీల్దార్ సయ్యద్ బాషా అక్కడికి చేరుకుని ఊటుకూరు ప్రాంతంలో నుంచి మట్టి తరలించకుండా నేటి నుంచే ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని లిఖితపూర్వకంగా హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



ఊటుకూరు గుట్ట వద్ద టిప్పర్‌లో మట్టిని వేస్తున్న ఎక్స్‌కవేటర్

8 వాహనాల్లో రెండింటిపైనే కేసు నమోదు

ఊటుకూరు గుట్ట వద్ద 8 టిప్పర్లు మట్టిని తీసుకెళుతున్నాయని నెంబర్లతో సహా పోలీసులకు, అధికారులకు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. అయితే మన్నూరు పోలీసుస్టేషన్‌లో 2 వాహనాలను పట్టుకున్నట్లు కేసు నమోదు చేశారు. కేవలం 2 వాహనాలనే పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై మన్నూరు సీఐ రవీంద్రనాథ్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా మట్టిని తోలుతున్న 2 వాహనాలను పట్టుకున్నామని తెలపడం గమనార్హం.

వైసీపీ మట్టి మాఫియాకే అధికారుల మద్దతు

ఈ సందర్భంగా టీడీపీ నాయకులు చెంగల్‌రాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు ఆర్.సతీశ్‌కుమార్‌రాజు, సీనియర్ టీడీపీ నాయకుడు మలిశెట్టి సుబ్బరాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చి 15 రోజులు అవుతున్నా వైసీపీ మట్టి మాఫియాకు అధికారులు మద్దతు పలుకుతున్నారని ఆరోపించారు. తాము ఈ మట్టిమాఫియాపై విజిలెన్స్ అధికారులకు, మైన్స్ అధికారులకు, స్థానిక రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇక చేసేది లేక తమ గ్రామమంతా ఏకమై మట్టి మాఫియాను అడ్డుకున్నామని తెలిపారు. ప్రభుత్వ అనుమతులు పొంది రాయల్టీ చెల్లించి తమ గ్రామ పంచాయతికి రాయల్టీ రూపేణా ఆదాయం వచ్చి అభివృద్ధి పనులు జరిగి ఉంటే తమకు అభ్యంతరం లేదని, అలా కాకుండా ప్రభుత్వం మారినా అధికారికంగా మట్టి తోలుతూ లక్షలు కాజేయడం ఏమిటని ప్రశ్నించారు. తాము 8 లారీలు పట్టుకుని అందుకు సంబంధించిన లారీల వివరాలను వాటి నెంబర్లతో లిఖితపూరంగా ఫిర్యాదు చేస్తే మన్నూరు సీఐ కేవలం 2 లారీలను పోలీసుస్టేషన్‌కు తరలించడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఇది వైసీపీ మట్టి మాఫియాకు మన్నూరు పోలీసులు కొమ్ము కావడం కాదా నిలదీశారు. వెంటనే ఈ మట్టి మాఫియాపై ఉక్కుపాదం మోపకపోతే పెద్దఎత్తున ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.



కడప-చెన్నై హైవేపై రాస్తారోకో చేస్తున్న ఊటుకూరు గ్రామ ప్రజలు



రాస్తారోకోతో కడప-చెన్నై రహదారిపై నిలిచిపోయిన వాహనాలు



కూలిన బాహుదా నది వంతెన

● రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు

నిమ్మనపల్లి, జూన్ 22: మండలంలోని కొండయ్యగారిపల్లి పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లి సమీపంలో ఉన్న బాహుదానది వంతెన శుక్రవారం రాత్రి ఒకవైపు కూలిపోయింది. నిమ్మనపల్లి-వాల్మీకిపురం వెళ్లే మార్గంలో బాహుదా వంతెనను నిర్మించగా ఆదే మార్గంలో నిమ్మనపల్లితో పాటు దాదాపు పది గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణం సాగిస్తుంటారు. వంతెన సగం వరకు విరిగిపోగా మిగిలిన భాగంలో ఇతర వాహనాలు వెళుతున్నాయి. అయితే పెద్ద వాహనాలు ఇదే మార్గం గుండా వెళితే పూర్తిగా వంతెన పడిపోయే ప్రమాదం ఉంది. అంతే కాకుండా సమీప గ్రామాల్లో ఉండే ప్రజలు ఎలాంటి అవసరం ఉన్నా నిమ్మనపల్లి రావాల్సి ఉంటుంది. సగం వంతెన కూలగా రాత్రి సమయాల్లో ఇదే మార్గంలో వెళ్లే వాహనదారులు ప్రమాదానికి గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. గతంలోనే బాహుదా వంతెన కూలుతుందని ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురించినా అధికారులు స్పందించలేదు. ప్రస్తుతం వంతెన కూలిన చోట రాళ్లు పెట్టి వాటికి తెల్లటి రంగు వేసి చెట్టు కొమ్మలను అడ్డుగా పెట్టారు. దీంతో సమీప గ్రామస్తులు మాట్లాడుతూ ప్రధాన రహదారిలో ఉన్న బాహుదా వంతెన కూలడంతో నిమ్మనపల్లికి వెళ్లలేకపోతున్నామని మిగిలిన దారిలోనే పోవాల్సి వస్తుందని తెలిపారు. అధికారులు స్పందించి వంతెనను నిర్మించాలని కోరుతున్నారు.

ఆక్రమణలతో ఇరుకైన మెయిన్ బజార్

పోటీపడి ఆక్రమణలు ● నడిరోడ్డుపైనే వాహనాల నిలుపుదల ● పట్టించుకోని పోలీసులు, టౌన్‌ప్లానింగ్ అధికారులు
ప్రయాణికుల తీవ్ర ఇబ్బందులు ● ప్రమాదాలకు నిలయంగా మారుతోందని స్థానికుల ఆందోళన

ఎర్రగుంట్ల, జూన్ 22: ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ సమీప మెయిన్‌రోడ్డులో ఇటీవల ఆక్రమణలు భారీగా పెరిగిపోయాయి. అత్యంత దారుణంగా ఉన్న ఈరోడ్డును ఇటీవలే ఆర్అండ్‌బీ వారు సీసీ రోడ్డు వేసి బాగుచేశారు. అయితే సీసీరోడ్డుకు ఇరువైపులా ఉన్న స్థలాన్ని ఖాళీగా వదిలేశారు. దీంతో రెండువైపులా ఉన్న దుకాణదారులు ఇష్టారాజ్యంగా ఆక్రమించుకుని ప్రయాణికులకు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారు. సీసీరోడ్డు వరకు మట్టిని వేసుకుని అక్కడి నుంచి వాహనాలను కనీసం పార్కింగ్‌కూడా చేసుకోనీయకుండా బోర్డులు అడ్డంగా పెడుతున్నారు. దీంతో ఈ మార్గం గుండా వచ్చే ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ఇతర వాహనాలు నడిరోడ్డుపైనే నిలిపి ప్రయాణికులను ఎక్కించుకోవడం, దించడం చేస్తున్నారు. ఎంతో విశాలంగా ఉన్న ఈరోడ్డు ఒక్కసారిగా ఇరుగ్గా మారిపోయింది. మూడు వాహనాలు ఒకేసారి వెళ్లేందుకు వీలున్న ఈమార్గాన్ని సీసీ రోడ్డు వేయగానే దుకాణదారుల దుశ్చర్యలతో ఒక వాహనం ఆగితే రెండో వాహనం వెళ్లేందుకు వీల్లేకుండా పోయింది. ముఖ్యంగా రైల్వే ప్రయాణికులు ఎంతో దూరం నుంచి వాహనాల్లో, బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. ఆతురతతో వెళ్లే ప్రయాణికులకు వీరు అడ్డంకిగా మారారు. కొన్ని అత్యవసర సందర్భాల్లో రైళ్లను కూడా మిస్ అయ్యే పరిస్థితి తీసుకొచ్చారు.

● రైల్వేస్టేషన్ కు వెళ్లే, వచ్చే దారి వద్ద రోడ్డుకు ఇరువైపులా ప్రయాణికులు భారీగా వుంటారు. ఈ ప్రాంతంలో చెట్లను నరికి రోడ్డు పక్కనే వేసి ప్రయాణికులు నిల్చునే వీల్లేకుండా చేశారు. దాతల సౌలభ్యంతో నిర్మించిన బస్‌స్టాప్‌ను కనిపించకుండా చేశారు. దాన్ని అధ్వాన్నంగా మార్చారు. హోటళ్లవారు ఒకరినొకరు పోటీపడి తమ దుకాణాలను రోజురోజుకూ మరీ ముందుకు సాగిస్తున్నారు. సీసీ రోడ్డు వరకు బోర్డులను అడ్డంగా పెట్టడం, పొయ్యలను కూడా పెడుతుండంతో బస్సులు నడిరోడ్డుపైనే నిలపాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో రైల్వేస్టేషన్‌కు వెళ్లే, వచ్చే వాహనాలు అక్కడే ఆగిపోతున్నాయి. దీంతో ట్రాఫిక్ కూడా జామవుతోంది. దీనికి తోడు తోపుడు బళ్లు కూడా మేమేమీ తక్కువ కాదన్నట్లు రోడ్డుపైనే పెడుతుండడంతో పరిస్థితి మరీ దారుణంగా మారింది. దీనికి తోడు ప్రభుత్వ మద్యం షాపు వద్ద సాయంత్రం పూట ద్విచక్ర వాహనదారులు రోడ్డుపైనే నిలిపి తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. సాయంత్రం ఇక్కడ తిరుణాళ్ల వాతావరణం ఉంటుంది. అంతా రోడ్లపైకి వచ్చేస్తే ఇక ప్రయాణికులకు భద్రత ఎక్కడుంటుందని వాహనచోదకులు ఆగ్రహిస్తున్నారు. ఈవిషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి ప్రయోజనం లేదని, పైగా వారి దుకాణాల వద్దకు వచ్చి టీతాగి, ఎంచక్కా బాతాఖాని చేసి, వాటర్ బాటిల్స్‌కూడా కొందరు ఉచితంగా తీసుకెళుతున్నారనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. ప్రజల ఇబ్బందులు పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. కళ్లెదుటే ఆక్రమణలు పెరిగిపోతున్నా పట్టించుకోకపోవడం దారుణమని ప్రజలు, ప్రయాణికులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. గతంలో నరపంచాయతీ కమిషనర్‌గా పనిచేసిన భవాని ప్రసాద్ ఆక్రమణలను పూర్తిగా తొలగించారు. నరగపంచాయతీ స్థలం వరకు మార్కింగ్ వేశారు. అయితే వాటిని పూర్తిగా చెరిపేసి దుకాణదారులు భారీగా ముందుకు వచ్చేశారని ప్రజలు విమర్శిస్తున్నారు.




రోడ్డుకు అనుకుని హోటల్ బోర్డు - నడిరోడ్డుపై ఆపిన ఆర్టీసీ బస్సులు...రోడ్డుపైనే ప్రయాణికులు

మాకేం సంబంధం లేదన్నట్లు అధికారులు

ఇక నగరపంచాయతీ అధికారులు పూర్తిగా నిద్రావస్థలో, మామ్మూళ్ల మత్తులో జోగుతున్నసంగతి తెలిసిందే. దుకాణదారులు ఆక్రమిస్తుంటే తమకేమీ సంబంధం లేదన్నట్లు చూసీచూడనట్లుగా సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు తీరుంది. ప్రజల అవస్థలను గాలికొదిలేసి కార్యాలయానికే పరిమితమై పాలన సాగిస్తున్నారని ప్రజలు పెద్దఎత్తున విమర్శిస్తున్నారు.

మోటార్‌సైకిళ్ల వేగంతో ఇబ్బందులు

ఇక్కడ మోటార్‌సైకిళ్ల వేగం భరించలేకున్నామని రైల్వే ప్రయాణికులు వాపోతున్నారు. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో ఆకతాయిలు ప్రయాణికులు వెళ్లే సమయంలో అడ్డంగా వెళ్ల భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వాపోతున్నారు.

ఆక్రమణలు తొలగింపు చర్యలు తీసుకుంటాం

ఆక్రమణలను ఉపేకించం. తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రయాణికులు, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

ఈశ్వరయ్య, సీఐ ఎర్రగుంట్ల

నగరపంచాయతీ వారికి ఫిర్యాదు చేస్తాం

రోడ్డుకు ఇరుపైవులా రోజురోజుకూ ఆక్రమణలు ఎక్కువ అవుతున్నాయి. వీటిపై నగరపంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేస్తాం. వాహనాల రాకపోకలకు ఇబ్బందులేకుండా చూస్తాం. సీసీ రోడ్డుకు ఇరువైపులా 1.5మీటర్ల వరకు గ్రావెల్‌ను నింపుతాం.

రామక్రిష్ణయ్య, ఏఈ ఆర్అండ్‌బీ

కోదండరాముడి సేవలో హర్యానా, పంజాబ్ హైకోర్టు న్యాయమూర్తులు



ఒంటిమిట్ట, జూన్ 22: కోదండరామస్వామి దేవాలయాన్ని శనివారం హర్యాన రాష్ట్ర హైకోర్టు జడ్జి సురేంద్రగుప్తా, పంజాబ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి అంకిత కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి టీటీడీ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. మూల విరాట్టు సీతారామ లక్ష్మణులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ రంగ మండపంలో ఆలయ విశిష్ట తను తెలుసుకుని స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

మద్యం మత్తులో ప్రయాణికుడి వీరంగం



మద్యం మత్తులో వీరంగం సృష్టిస్తున్న చెంద్రాయుడు

నందలూరు, జూన్ 22: మద్యం మత్తులో ఓ ప్రయాణీకుడు వీరంగం సృష్టించాడు. కడప నుంచి రాజంపేటకు వస్తున్న పల్లెవెలుగు బస్సులో ఆకేపాడు, హస్తవరం వద్ద కొతపల్లె వాసి దండె చెంద్రాయుడు మద్యం మత్తులో కడపలో బస్సు ఎక్కి టిక్కెట్ తీసుకోకుండా కండక్టర్, డ్రైవర్, తోటి ప్రయాణికులతో ఘర్షణకు దిగాడు. ఇదేమి అన్యాయమని ప్రశ్నించిన మహిళా ప్రయాణికురాలిపై పాదరక్షతో దాడి చేయడంతో నందలూరు పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. మద్యం మత్తు దిగకపోవడంతో పోలీసుస్టేషన్‌లో సైతం వీరంగం సృష్టించారు. ఆర్‌టీసీ డ్రైవర్, కండక్టర్ ఫిర్యాదుతో ఎస్ఐ అబ్దుల్ జహీర్ కేసు నమోదు చేశారు.

యువరచయితలకు అవకాశం

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 22: జాతీయ తెలుగు యువ రచయితల సమ్మేళనంలో పాల్గొనడానికి 40 ఏళ్లలోపు యువరచయితలకు అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా రచయితల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం తెలిపారు. డిసెంబరు 28, 29 తేదీల్లో క్రిష్ణాజిల్లా రచయితల సంఘం సహకారంతో ప్రపంచ తెలుగు రచయితల ఆధ్వర్యంలో విజయవాడలో జాతీయ తెలుగుయువరచయితల సమావేశం జరుగుతుందని తెలిపారు. రెండు రోజుల శిక్షణ శిబిరంలో పద్యరచన, వచన కవిత, నవల, గేయం, నాటకం, వ్యాసరచన వక్రియలో సుప్రసిద్ధ రచయితలతో శిక్షణ ఇప్పించి ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేసి ఘనంగా సత్కరిస్తామని తెలిపారు. యువరచయితలు ఈ అవకాశం సద్వినియోగ చేసుకోవాలని తెలిపారు.

వైభవంగా కోదండరాముని కల్యాణం



కల్యాణోత్సవం సందర్భంగా ప్రత్యేక అలంకరణలో సీతారాములు

ఒంటిమిట్ట, జూన్ 22: ఏకశిలానగరి కోదండరామాలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా ఉత్సవమూర్తులైన సీతారాములను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణమండపం వద్ద ఉంచి కల్యాణతంతును ప్రారంభించారు. విష్వక్సేనపూజ, పుణ్యావచనం, కంకణధారణ, యజ్ఞోపవితరణ కార్యక్రమం నిర్వహించిన అనంతరం మాంగళ్యధారణను వైష్ణవ సంప్రదాయంలో ఆగమ శాస్త్ర ప్రకారం టీటీడీ అర్చకులు సీతమ్మ తల్లికి మాంగళ్యధారణ చేశారు.



హాజరైన భక్తులు

అనంతరం తలంబ్రాల సమర్పణ, పూలచెండుల మార్పిడి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీటీడీ ఇన్‌స్పెక్టర్ నవీన్, సిబ్బంది నాయక్, ప్రవీణ్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

వైసీపీలా అవినీతి చేయం... చేయనివ్వం

● ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ నిజాయితీపరుడు

● మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి



ఖాజీపేట, జూన్ 22: టీడీపీ ప్రభుత్వం అవినీతి చేయదని, ఎవరినీ చేయనివ్వదని, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ నిజాయితీపరుడని మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి అన్నారు. శనివారం ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ వారసత్వపు రాజకీయాలకు మైదుకూరు ప్రజలు బుద్ధి చెప్పారని, ప్రభుత్వం మారినా అధికారుల్లో ఇంకా మార్పు రాలేదన్నారు. చాపాడు మండలం కుచ్చుపాప రెవెన్యూలో మాజీ ఎమ్మెల్యే 36 ఎకరాలు ఆక్రమించుకుని చేపల చెరువుకు కౌలుకు ఇచ్చారని, ఇప్పుడు స్థానిక భూములు గల ఎస్సీలు తిరగబడ్డారని, ఆ భూములపై ఎమ్మెల్యే పుట్టాకు ఫిర్యాదు చేసి బాధితులకు న్యాయం జరిగేలా చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో కొత్త సబ్‌స్టేషన్లు వచ్చాయని, వాటిల్లో షిఫ్ట్ ఆపరేటర్ ఉద్యోగాలకు ఒక్కొక్కరి నుంచి రూ.10 లక్షలు మాజీ ఎమ్మెల్యే తీసుకున్నాడని, ఆ విషయమై ఎమ్మెల్యే పుట్టా డీఈకి ఫిర్యాదు చేశారని డీఎల్ తెలిపారు. మిట్టమానుపల్లెలో హోంగార్డు ఉద్యోగం ఇప్పిస్తామని రూ.7 లక్షలు తీసుకున్నారన్నారు. ఇలా చెప్పుకుంటూపోతే మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అరాచకాలు మరెన్నో ఉన్నాయన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే అవినీతి చేయడు, అవినీతిని చేయనివ్వనని చెప్పాడన్నారు. ఖాజీపేటలో వైసీపీ హయాంలో రేషన్ బియ్యం అమ్ముకుని బైపాస్ రోడ్డులో విలాసవంతమైన భవనాలు నిర్మించుకున్న వ్యక్తిపై కూడా చర్యలు తీసుకుంటామని ఇలాంటి వ్యక్తులు ఎలా అక్రమాలకు పాల్పడుతున్నారో అధికారులు గుర్తించాలన్నారు. మైదుకూరులో ఉన్న బార్ కోదండరాముని దేవాలయం భూమిలో ఉందని, అక్రమాలకు పాల్పడిన ఎక్సైజ్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఖాజీపేట పంచాయతీ పరిధిలో రూ.3 లక్షలతో రోడ్డు వేసి రూ.13 లక్షలు స్వాహా చేశారని, దానిపై ఫిర్యాదు చేసి వారిపై చర్యలు తీసుకునేలా చేస్తామని తెలిపారు.

మేడ మీది నుంచి పడిన భవననిర్మాణ కార్మికుడు

ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న కార్మికుడు



భవననిర్మాణ కార్మికుడు

ప్రొద్దుటూరు, జూన్ 22: మేడమీద గోడలకు పూత పనిచేస్తూ ప్రమాదవ శాత్తు కిందపడి విద్యుత్ తీగలు తగిలి భవననిర్మాణ కార్మికుడు వంశీ తీవ్ర గాయాలపాలయ్యాడు. వివరాల్లోకెళితే... తాళ్ళమాపురం వాసి వంశీ బేల్దారి పనిచేస్తాడు. ప్రొద్దుటూరు పట్టణం నాగేంద్రనగర్ కుండావారి షాపువద్ద భవన నిర్మాణం పనికి వచ్చి ప్రమాదంలో గాయపడి ప్రాణాపాయ స్థితిలో వున్నారు. శరీరం దాదాపు 60 శాతం శరీరం కాలిపోయింది. సచివాయ సిబ్బంది సంఘటనా స్థలంలో పడివున్న వంశీని వాహనంలో ఎక్కించి ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్ళారు. పరిస్థితి విషమంగా వుందని వైద్యులు తెలపడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. వంశీ విషమ పరిస్థితిలో చికిత్స పొందుతూ చావుబతుకుల మధ్య కొట్టు మిట్టాడుతున్నారు. వంశీకి అమ్మా నాన్న లేకపోవడంతో చిన్నమ్మ దగ్గర ఆశ్రయం పొందుతున్నాడు. పేదరికంలో మగ్గుతున్న ప్రాణాపాయ స్థితిలో ఉన్న భవన నిర్మాణ కార్మికుడు వంశీకి వైద్య సహాయం అందించాలని వేడుకుంటున్నారు.

సాత్విక భేరి మోగించిన రమణారెడ్డి

● వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 22: స్వతంత్రమైన విచారణ శక్తితో భగవంతుడు, ఆత్మ ప్రజ్ఞానం పరమాత్మ వంటి ఆధ్యాత్మిక పదాలకు కొత్త నిర్వచనం చెప్పి విద్వాన్ రమణారెడ్డి సాత్విక భేరి మోగించాడని వైవీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ తెలిపారు. సీపీ బ్రౌన్ బాషా పరిశోధన కేంద్రంలో రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధనరాజు, జిల్లా రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో రమణారెడ్డి రచించిన ప్రజ్ఞాన ప్రకాశిక పుస్తకావిష్కరణ చేశారు. రమణారెడ్డి మొదట సాక్షాత్కారం, తరువాత గీర్వాణి తిలకం, గీతాంజలి రచించారని ఇప్పుడు ఆయన రచించిన ప్రజ్ఞాన ప్రకాశిక జ్ఞాన పరిణతికి నిదర్శనంగా చెప్పవచ్చన్నారు. ఈ గ్రంథంలో ఆయన ద్వైత, అద్వైత విశిష్ట అద్వైతాలను క్షుణ్ణంగా పరిశీలించి త్రిమతాల సాత్విక చింతననుచారిత్రక దృక్పథంతో విశ్లేషించారన్నారు. ప్రొఫెసరు మూలమల్లికార్జునరెడ్డి, ప్రొఫెసరు గుర్విరెడ్డిగారి శివారెడ్డి, ప్రొఫెసరు నల్లపురెడ్డి, పరీక్షల నిర్వహణ అధికారి ప్రొఫెసరు ఎస్.ఈశ్వర్‌రెడ్డి తదితరులు మాట్లాడారు.

వ్యక్తి దారుణ హత్య

తాగివుండగా గుర్తుతెలియని వారి దాడి ● హత్య కేసు నమోదు చేసిన పోలీసులు



పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ

ప్రొద్దుటూరు, జూన్ 22: మద్యం మత్తులోవున్న అర్షద్(37)ను గుర్తు తెలియని వ్యక్తులు బండరాయితో తలపై మోది దారుణంగా చంపారని పోలీసులు తెలిపారు. వివరాల్లోకెళితే...

రామేశ్వరం రోడ్డు వసంతపేట ఏరియాలో ప్రభుత్వ వైన్‌షాపు, బార్అండ్ రెస్టారెంట్ వుంది. ఇక్కడ మద్యం ప్రియులు రోడ్లపై మద్యం తాగుతూ వీరంగం చేస్తుంటారు. ఈ తాగుబోతుల వలన రోజు ఆ రోడ్డులో వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. ఉదయం నుంచి రాత్రివరకు తాగుబోతులు రోడ్లపై మద్యం తాగి తరచూ గొడవలు పడుతుంటారు. శుక్రవారం అర్ధరాత్రి 12 గంటలకు ప్రభుత్వ వైన్‌షాపు సమీపంలో తాగిపడి వున్న అర్షద్‌పై కొందరు గుర్తు తెలియని దుండగులు బండరాయితో దాడి చేసి చంపారు. రామేశ్వరం రోడ్డు నైట్ బీట్‌కు వచ్చిన వన్‌టౌన్ కానిస్టేబుల్ ద్వారా హత్య గుర్తించి తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్, డీఎస్పీ మురళీధర్ సంఘటనా స్థలికి వచ్చి పరిశీలించారు. హత్యకుగల కారణాలపై విచారిస్తున్నారు. హత్యకుగురైన వ్యక్తి షేక్ అర్షద్ అని, దర్గా బజార్‌కు చెందిన వాడని ఆటో డ్రైవరుగా జీవిస్తున్నాడని సీఐ శ్రీకాంత్ గుర్తించారు. శుక్రవారం అతను మద్యం తాగేందుకు వైన్ షాపుకు వచ్చి మద్యం తాగి అక్కడ పడిపోయి వుండగా అతన్ని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా బండరాయితో తలపై గుద్ది హత్యచేశారన్నారు. హత్యకు గురైన అర్షద్‌సోదరుడు పర్షద్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి విచారిస్తున్నామన్నారు.

వివాదాస్పదమైన దేవాలయం స్థలం

రోడ్డెక్కిన నర్సింగపల్లె వాసులు ● రంగప్రవేశం చేసిన పోలీసులు




నర్సింగపల్లెలో గ్రామస్తులకు సర్దిచెబుతున్న పోలీసు అధికారులు
దేవాలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని రోడ్డుపై బైఠాయించిన నర్సింగపల్లె వాసులు

పోరుమామిళ్ల, జూన్ 22: దేవాలయ నిర్మాణానికి కావలసిన స్థలం కోసం ఊరంతా కదిలారు. కానీ ఆ స్థలం తనకు ప్రభుత్వం పట్టా ఇచ్చిందని అభ్యంతరం తెలిపాడు ఒక గ్రామస్తుడు. కంప తొలగించేందుకు సిద్ధమయ్యారు గ్రామస్తులు. విషయం పోలీసుల దృష్టికి వెళ్లడంతో రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపు చేసేందుకు ప్రయత్నాలు చేశారు. దేవాలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని రోడ్డుపై బైఠాయించారు నర్సింగపల్లె గ్రామస్తులు. విషయం తహశీల్దారు దృష్టికి తీసుకెళ్లడంతో రికార్డులు పరిశీలించిన తరువాత చర్యలు తీసుకుంటాం, అంత వరకు సంయమనం పాటించాలని తహసీల్దారు సూచించారు. వివరాలిల్లోకెళితే....

పోరుమామిళ్ల మండలం రంగసముద్రం పంచాయతీ పరిధి నరసింగపల్లెలో సర్వేనెంబరు 570లో దేవాలయ నిర్మాణాలకు గ్రామకంఠమైన ఆ స్థలం కేటాయించాలని ఎన్నో ఏళ్లగా అక్కడే దేవాలయ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించుకున్నామని గ్రామస్తులు శనివారం కంపచెట్లను తొలగించే ప్రయత్నం చేశారు. అయితే అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తనకు రెవెన్యూ అధికారులు ఆ స్థలంలో పట్టా ఇచ్చారని, అది తన స్థలమని అభ్యంతరం తెలపడంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీనికి సంబంధించి పోలీసు అధికారులకు ఫిర్యాదు అందడంతో రంగప్రవేశం చేసి కంప తొలగింపు కార్యక్రమానికి అభ్యంతరం తెలిపారు. దీంతో గ్రామస్తులంతా వారితో వాగ్వాదానికి దిగి రోడ్డుపై బైఠాయించారు. దీంతో తహసీల్దారు శిరీష దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె ఇరువర్గాలతో మాట్లాడి ఆ స్థలం సంబంధించిన రికార్డులు వారి వద్ద ఏమైనా ఉంటే తీసుకురమ్మన్నారు. వాటిని పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుటామని అంత వరకు ఆ స్థలంలో ఎవరూ జోక్యం చేసుకోరాదని తెలి పారు. ప్రస్తుతానికి ఏమో సమస్య సద్దుమణిగినా మళ్లీ పునరావృతమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. సోమవారం రెవెన్యూ తహసీల్దారు కార్యాలయంలో రికార్డులు అందజేయాల ని వారిని ఆదేశించారు. మరి తదుపరి చర్యలు ఎలా ఉంటాయో వేచి చూడాల్సిందే.

బ్యూటీపార్లర్‌లో చోరీ - బంగారు, నగదు అపహరణ

పెనగలూరు, జూన్ 22: స్థానిక బ్యూటీపార్లర్‌లో శుక్రవారం రాత్రి చోరీ జరిగినట్లు ఇంటి యజమాని గుంటుపల్లె పద్మ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. ఇనుప కటాంజనం తొలగించి లోనికి ప్రవేశించి బీరువా పగులగొట్టి అందులోని 8 తులాల బంగారు, 15 వేల నగదును అపహరించుకుని పోయినట్లు తెలిపారు. ఒకసారి 3 ఉంగరాలు తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆమె ఫిర్యాదుపై శనివారం ఉదయం క్లూస్ టీంను, డాగ్‌స్క్వాడ్‌ను పిలిపించి విచారణ ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. కనకలూరులో జరుగుతున్న వేణుగోపాలస్వామి ఉత్సవాలకు వెళ్లి సాంస్కృతిక కార్యక్రమాలు ముగిసిన తర్వాత 3.30 గంటలకు ఇంటికి వచ్చి చోరీ జరిగినట్లు గుర్తించారు. విషయాన్ని పోలీసులకు సమాచారం ఇచ్చి న్యాయం చేయాల్సిందిగా ఆమె కోరినట్లు ఆయన తెలిపారు.

గోవుకు పుట్టినరోజు వేడుకలు



గోవుకు జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న వీహెచ్‌పీ సభ్యులు

పుల్లంపేట, జూన్ 22 గోమాతను రక్షించడమేగాకుండా వాటికోసం పోరాటాలు చేస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు శనివారం గోవులకు జన్మదినోత్సవాలు కూడా చేస్తున్నారు. పుల్లంపేటలోని శివాలయానికి చెందిన 2 గోవులను కమలాపురం మనోహర్‌రెడ్డి పెంచుతున్నారు. వీటికి మరో మూడు గోవులు జన్మించాయి. గో సంరక్షణ బాధ్యతలను తీసుకోవడమేగాకుండా అన్నమయ్య జిల్లా విశ్వహిందూ పరిషత్ గో ప్రముఖ్‌గా ఉంటున్న మనోహర్ రెడ్డి ఆ గోవులకు మొదటి సంవత్సరం ఘనంగా జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్నారు. ఈ గోవుల్లో 2 గోవులను అప్పయ్యరాజుపేటకు చెందిన అడ్వకేట్ అరుణ్‌కు పెంచుకునేందుకు ఇచ్చారు. శనివారం గోవు పుట్టినరోజు కావడంతో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గోమాతకు ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేయించి అనంతరం గ్రామస్థుల సమక్షంలో కేక్ కట్‌చేసి పిల్లలకు మిఠాయిలు పంచిపెట్టారు. పుట్టిన ప్రతి గోవుకు మొదటిసారి జన్మదిన వేడుకలు నిర్వహిస్తూ తెలుగు జాతికి గోవు గొప్పతనం గురించి ఈ విధంగా తెలియజేస్తున్నామని మనోహర్‌రెడ్డి తెలియజేశారు.

యల్లమ్మకు పూజలు



ప్రత్యేక అలంకరణలో యల్లమ్మ

సుండుపల్లె, జూన్ 22: మండల కేంద్రానికి సమీపంలోని చెన్నం శెట్టిపల్లె సమీపంలో శనివారం యల్లమ్మ జాతర ప్రారంభమైంది. ఉదయం గణపతి పూజ, అంకురార్పణ, మంగళహారతి నిర్వహించారు. పెద్ద సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు. హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాల ను అందజేశారు. ఆదివారం అమ్మవారికి అభిషేకం, పుట్ట బంగారం తెచ్చుట, పొంగుబాలు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

24న మండల సర్వసభ్య సమావేశం

లక్కిరెడ్డిపల్లె జూన్22; ఈ నెల 24న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏఓ గురుప్రసాదు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని ఆయన తెలియజేశారు.

హిందీ మెటీరియల్ పంపిణీ



హిందీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న సర్తాజ్‌హుసేన్

పుల్లంపేట, జూన్ 22 : మండల పరిధిలోని టి.కమ్మపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయుడు సర్తాజ్‌హుస్సేన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు హిందీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలుగుదేశం నాయకుడు పేర్ల చంద్రశేఖర్‌నాయుడు మాట్లాడుతూ పదో తరగతిలో మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థికి 5 వేల రూపా యలు బహుమతి ఇస్తామన్నారు. ఉపాధ్యాయులు రమణారెడ్డి, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

పుల్లంపేట, జూన్ 22 : పర్వతవర్ధిని దేవి శాంతి లింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శివపార్వతుల కల్యాణాన్నినిర్వహిం చారు. శివపార్వతులను ప్రత్యేకంగా అలం కరించి మేళతాళాల మధ్య వేదికపైకి తీసుకువచ్చి వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య శాస్త్రోక్తంగా కల్యాణా న్నినిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జరగనిది జరిగినట్లు..!

- పది రోజుల ముందే నిర్వహించినట్లు సంతకాలు
- కోటి రూపాయల బిల్లుల కోసమేనా..
- మండల సమావేశం తీరిది...



మండల సమావేశం జరిగినట్లు రికార్డులో సంతకాలు చేసిన దృశ్యం

పుల్లంపేట, జూన్ 22 : మండలంలో అధికారులకు వైసీపీ నాయకులు చెప్పిందే వేదం. అది తప్పయినా, ఒప్పయినా చేయమంటే పనిచేసే స్వామి భక్తి చాటుకుంటారు. జరగని మండల సర్వసభ్య సమావేశాన్ని జరిగినట్లు సంతకాలు తీసుకుని పూర్తి చేశారంటే మండల అభివృద్ధి శాఖలో పనిచేసే అధికారులు వైసీపీ నాయకులకు ఎలా సహకరించారో తెలుస్తుంది. మండల సమావేశం నిర్వహించాలంటే ముందుగా మండలంలో పనిచేసే అధికారులందరికీ సర్క్యులర్ జారీ చేయాలి అలా కాకుండా మండల స్థాయి అధికారులు ఎవరికీ తెలియకుండానే మండల సర్వసభ్య సమావేశం జరపకపోయినా జరిగినట్లు పూర్తి చేశారు. ఈనెల 12వ తేదీ కొత్తగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం ప్రమాణ స్వీకారం ఉండటంతో రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి ఎంపీడీవో నరసింహరావుకు ఫోన్ చేయడంతో వాయిదా వేశారు. ఇంతలో ఏమి జరిగిందో ఏమో ఎంపీటీసీల ఇళ్ల వద్దకు వెళ్లి మినిట్స్ బుక్‌లో సంతకాలు తీసుకున్నారు. మే 28వ తేదీ సర్వసభ్య సమావేశం నిర్వహించినట్లు ఎంపీడీవో కూడా అందులో సంతకం చేశారు. ఇలా సమావేశాన్ని వాయిదా వేసి తిరిగి పది రోజుల ముందే సమావేశం పూర్తయినట్లు ఎందుకు చేశారో వైసీపీ నాయకులు, అధికారులకే తెలియాలి. ఇప్పటికే మండల గ్రాంట్‌లో కోటి రూపాయలకు పైగా స్వాహా అయినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిని బట్టి అన్నీ చక్కబెట్టేందుకే వైసీపీ నాయకులకు మండల పరిషత్ అధికారులు సహకరించినట్లు టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. శనివారం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ఎంపీడీవో నరసింహ మూర్తిని మండల సర్వసభ్య సమావేశంపై రికార్డులు చూపమని కోరగా అందులో ఈ విషయాలు బయటపడ్డాయి. టీడీపీ నాయకులు నిలదీయగా తప్పు జరిగిపోయిందని, దయచేసి ఈ విషయాలు బయటపెట్టి మమ్మల్ని ఇబ్బంది పెట్టవద్దని బతిమాలినట్లు తెలిసింది. ఏది ఏమైనా మండల గ్రాంట్‌లో కోట్లాది రూపాయల కుంభకోణం జరిగిందని ఎంపీడీవో కార్యాలయంలో పనిచేసే అధికారి వైసీపీ నాయకులకు అడుగులకు మడుగులొత్తారని ఆ పార్టీ నాయకులే ఆరోపిస్తున్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం

- జిల్లా 5వ అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి



జాతీయ లోక్ అదాలత్‌పై జరిగిన సమవేశంలో మాట్లాడుతున్న జిల్లా ఐదవ అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి

రాయచోటిటౌన్, జూన్ 22: పట్టణంలోని జిల్లా ఐదవ అదనపు జడ్జి కోర్టులో ఈ నెల 29వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా 5వ అదనపు జడ్జి కృష్ణన్ కుట్టి పిలుపునిచ్చారు. న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం రాయచోటి కోర్టులో పోలీసు అధికారులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ రాయచోటి జిల్లా ఐదవ అదనపు కోర్టు పరిధిలోని అన్ని కోర్టుల్లో ఈ నెల 29వ తేదీన శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఐదవ అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి , సీనియర్ జడ్జి ప్రసన్న, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి జిసి అసిఫా సుల్తాన్, డాక్టర్ కే. శారద మాట్లాడుతూ రాయచోటి పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లలో నమోదైన క్రిమినల్, సివిల్ తదితర కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమానికి అత్యధిక కేసులు వచ్చే విధంగా పోలీసు వారు సహకరించాలని తెలియజేశారు. ఈ లోక్ అదాలత్ కార్యక్రమంలో క్రిమినల్ చెక్‌బౌన్స్, ఎస్ఐ యాక్టు సమ్మరీ కేసెస్, క్రిమినల్‌కు సంబంధించిన అన్ని కేసులు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీధర్, ట్రాఫిక్ సీఐ మహబూబ్‌బాషా, ఎస్ఐ భక్తవత్సలం, రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా వేణుగోపాలుడి కల్యాణోత్సవం



పెనగలూరులో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలుడి కల్యాణోత్సవం

పెనగలూరు, జూన్ 22 : వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి దేవాలయ ముఖ మండపంలో రుక్మిణీ సమేత సత్యభామ వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం గొనేని కృష్ణయ్యనాయుడు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో కన్నులపండువగా నిర్వహించారు. కృష్ణయ్యనాయుడు కుటుంబ సభ్యులు దేవేరులకు పట్టువస్త్రాలు, పూలహారాలు సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే కొండూరు మారారెడ్డి సతీమణి ప్రభావతమ్మ కుటుంబ సభ్యులు కొండూరు అజయ్‌రెడ్డి, కొండూరు విజయ్‌రెడ్డి ముత్యాల తలంబ్రాలు అందజేశారు. ప్రధాన కార్యకర్త చెంచు సుబ్బనరసయ్య ఆధ్వర్యంలో పండితుల బృందం పి.వెంకటసుబ్బయ్య, పామిడికాలవ గోపీనాథ్, చంద్రశేఖర్‌శర్మ, సాయికుమార్ తదితరుల మంత్రోచ్చరణలతో కల్యాణఘట్టం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు శ్రీవారికి భారీగా నగదు, వెండి రూపాల్లో కానుకలను అందజేశారు. పెనగలూరు గ్రామానికి చెందిన అనంతపురం జిల్లా సిఐ కలివల మురళీమోహన్, ఓబులవారిపల్లె టీఎస్ఎస్ ఏఎస్ఐ శ్రీనివాసులు సోదరుల ఆధ్వర్యంలో భక్తులకు ఐదు రకాల ప్రసాదాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త, జిలకర సుబ్బయ్య, మాజీ ధర్మకర్తలు, గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు పాలొన్నారు.

గరుడవాహనంపై దర్శనం

శుక్రవారం రాత్రి రుక్మిణీ సత్యభామ సమేతుడైన వేణుగోపాలుడు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమాన్ని గ్రామంలోని ముదిరాజ్‌సంఘం సభ్యులు వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని పలు వీధుల్లో నివాసం ఉన్న ముదిరాజ్ సంఘం సభ్యులు వారి ఇంటి నుంచి మేళతాళాలతో శ్రీవారికి నైవేద్యాలు, పూజా సామగ్రిని తీసుకువచ్చి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ప్రధాన కార్యకర్త పి.చెంచు సుబ్బనరసయ్యస్వామి, అర్చకులు చంద్రశేఖర్‌శర్మ, పూజారి సాయికుమార్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఇటుక లోడు ట్రాక్టర్ బోల్తా : తప్పిన ప్రమాదం



బోల్తాపడిన ట్రాక్టర్, కూలీలను బయటకు తీస్తున్న స్థానికులు

రైల్వేకోడూరు, జూన్ 22: ఇటుక లోడుతో వెళుతున్న ట్రాక్టర్ శనివారం మండలంలోని ఉప్పరపల్లె వద్ద ఒక పెట్రోల్ బంకుకు సమీపం లోబోల్తా పడింది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఉప్పర పల్లె నుంచి రైల్వేకోడూరుకు ఇటుక లోడుతో వస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడింది. ఇందులో ముగ్గురు కూలీలున్నారు. బోల్తా పడిన సమయంలో ఉప్పరపల్లె గ్రామస్తులు ట్రాక్టర్ కింద ఇరుక్కున్న కూలీలను బయటకు లాగారు. వీరు గాయాలతో బయటపడ్డారు. సకాలంలో స్థానికులు స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దీంతో ఎలాంటి ప్రాణ నష్టం లేకుండా పోవడంతో కూలీలు ఊపిరి పీల్చుకున్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు : తహసీల్దార్

సిద్దవటం, జూన్ 22 : అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠినచర్యలు తప్పవని తహసీల్దారు మురాషావలి హెచ్చరించారు. సిద్దవటంలోని తన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెన్నానది పరివాహక ప్రాంతాల నుంచి జోరుగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు తమకు ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఆర్డీవో నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చాయన్నారు. దీంతో గ్రామ సచివాలయాల్లో కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని, పెన్నానదిలో ఇసుక నిల్వలున్న ప్రాంతాలను ఈ కమిటీలు గుర్తిస్తాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు, జిల్లా కలెక్టర్ ఆదేశాలు వచ్చేంతవరకు పెన్నానదిలో ఎక్కడా ఇసుక తరలించకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో దిట్ట శ్రీనివాసులు



ప్రకృతి వ్యవసాయంతో పండించిన కర్బూజ కాయలు అమ్ముతున్న శ్రీనివాసులు

ఓబులవారిపల్లె, జూన్ 22 : మండలంలోని గాదెల కొత్తపల్లె గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండిస్తూ పలువురు రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. 2018 నుంచి నేటి వరకు అన్నిరకాల పంటలు రసాయన రహితంగా పండిస్తూ వాటిని చుట్టుపక్కల గ్రామాలతో పాటు రాజంపేట, కోడూరు టౌన్లలో విక్రయిస్తున్నాడు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఖర్బూజ, దోస , వంగ, మిర్చి, టమాటో, అరటి, బొప్పాయి అన్నిరకాల కూరగాయలు బాగా అమ్మకాలు జరుగుతున్నాయని తెలిపారు. ఎటువంటి రసాయనాలు లేకుండా పండిస్తున్న విషయం అనంతరాజుపేట ఉద్యాన యూనివర్సిటీ వారు 2018-19 సంవత్సరానికి ఉత్తమ రైతు గ్రహీత అవార్డులు అందించారని తెలిపారు. ఈ సందర్భంగా రైతు శ్రీను మాట్లాడుతూ గౌతమ మహర్షి పద్ధతిలో ప్రతిఒక్క రైతు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండిస్తే అందరికి ఆరోగ్యం పంచినవారు అవుతారని తెలిపారు.

విద్యార్థులకు నగదు పురస్కారాలు



నగదు బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

నందలూరు, జూన్ 22: 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో మండలంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు శనివారం నందలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో నగదు బహుమతులు అందజేశారు. అరిగె పెద్దసుబ్బరాయుడు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు శ్రీరాం ప్రజా వైద్యశాల అధినేత డాక్టర్ అరిగె రాంప్రసాద్ ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు గత ఏడాది నుంచి నగదు బహుమతులు ఇస్తున్నారు. శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాజంపేట పార్లమెంట్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 572 మార్కులతో మొదటిస్థానంలో నిలిచిన టంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి హేమంత్‌యాదవ్, ఎ 567 మార్కులు సాధించి రెండో స్థానంలో నిలిచిన పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని రూపా, 560 మార్కులు తెచ్చుకుని మూడో స్థానంలో నిలిచిన నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి షఫియాసుల్తానాకు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు రౌఫ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు మున్సిపల్ కార్యాలయంలో చంద్రబాబు ఫొటో



మున్సిపల్ సభాభవనంలో చంద్రబాబునాయుడు ఫొటో ఏర్పాటు చేసిన టీడీపీ నేతలు

రాజంపేట టౌన్, జూన్ 22 : ఎట్టకేలకు రాజంపేట మున్సిపాలిటీ కార్యాలయ సభాభవనంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫొటో ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు ఈ కార్యాలయంలోని మున్సిపల్ చైర్మన్ చాంబర్‌లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటో ఉండేది. ఈ విషయంపై ఇటీవల టీడీపీ నేతలు కమిషనర్‌పై ఒత్తిడి తీసుకువచ్చినా అధికారులు ఆ ఫొటోను తొలగించలేదు. దీంతో శనివారం తెలుగుదేశంపార్టీ పార్లమెంట్ కార్యదర్శి సుబ్రమణ్యంనాయుడు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు డీఆర్ఎల్ మణి, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వేణుగోపాల్, పార్లమెంట్ అధ్యక్షుడు శివ, మహిళా నాయకురాలు మిరియాల జ్యోతి, పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు సంజీవరావు, మాజీ కౌన్సిలర్ గుగ్గిళ్ల చంద్రమౌళి, ఆనంద్. క్లస్టర్ ఇన్‌చార్జి కొల్లు రెడ్డయ్యనాయుడు తదితరులు మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని కమిషనర్ రాంబాబుతో ఈ విషయం చర్చించారు. ప్రభుత్వం మారి 15 రోజులు దాటుతున్నా మున్సిపల్ చైర్మన్ చాంబర్‌లో జగన్ మోహన్‌రెడ్డి ఫొటో పెట్టుకోవడంలో అర్థమేమిటని ప్రశ్నించారు. మున్సిపల్ కార్యాలయం ప్రభుత్వ కార్యాలయం అని, ఇది వైసీపీ జాగీరు కాదన్నారు. వెంటనే ఆ ఫొటోను తొలగించి చంద్రబాబునాయుడు ఫొటో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్మన్ చాంబర్‌కు తాళం వేసి ఉన్నారని, చర్చించి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపినా వినిపించుకోలేదు. టీడీపీ నేతలే స్వయంగా చంద్రబాబునాయుడు ఫొటోను తీసుకొచ్చి మున్సిపల్ సభాభవనంలో ఏర్పాటు చేశారు. చైర్మన్ చాంబర్‌లో జగన్ ఫొటో తొలగించాలన్నారు. తొలగించకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఆంజనేయ స్వామికి 101 కొబ్బరికాయలు



కొబ్బరికాయలు సమర్పించిన టీడీపీ నాయకులు

లక్కిరెడ్డిపల్లె, జూన్ 22: మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి మంత్రి పదవి రావడంతో దప్పేపల్లెకు చెందిన టీడీపీ నాయకులు కార్యకర్తలు శనివారం ఆ గ్రామ సమీపంలోని ఆంజ నేయస్వామి ఆలయంలో చిలేకాంపల్లె నాగిరెడ్డి ఆధ్వర్యంలో 101 కొబ్బరికాయలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ హయాంలో ఎన్నో అరాచకాలు, అక్రమాలు జరిగాయని, వీటిని జీర్ణించుకోలేక ప్రజలు గుణపాఠం చెప్పారని నాగిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు వెంకట నారాయణ, రెడ్డెప్ప, కల్పరమణ, ఓదేటి మహ్మద్, బుడ్డారెడ్డి, ఎం ఓబులేసుయాదవ్, పల్లా వెంకటేసు, పూజల ఆదిరెడ్డి, కోయిలకుంట్ల రమణయ్య, రాయవరం మహేష్, పల్లెపు బాలసుబ్బయ్య, శివపల్లా వెంకటేసు, రామిశెట్టి కేశవ, వేమిరెడ్డి, మురళీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘భాష్యం’ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి



డీఈవోకు వినతి పత్రం అందజేస్తున్న లవకుమార్

రాయచోటి టౌన్, జూన్ 22: విద్య ను వ్యాపారంగా మార్చి వేసిన రాయచోటిలోని భాష్యం పాఠశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐ ఎస్ఎఫ్ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి లవకుమార్ డీఈవోకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగామాట్లాడుతూ భాష్యం పాఠశాల యాజమాన్యం విద్యాశాఖ నిబంధనలను తుంగలో తొక్కి అడ్మిషన్ ఫీజుల పేరుతో వేల రూపాయలు వసూలు చేయడమే కాకుండా, పాఠశాలలోనే యూనిఫాం, షూస్, బెల్టులు, నోటు పుస్తకాలు అమ్ముతూ విద్యను వ్యాపారం చేసేసిందన్నారు. కండిషన్‌లో లేని బస్సులను అర్హత లేని డ్రైవర్లతో నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతోందన్నారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన లైబ్రరీ, ల్యాబ్స్ వంటి సౌకర్యాలు లేవని తెలిపారు. ఆ పాఠశాలపై కఠిన చర్యలు తీసుకుని విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని ఆయన డీఈవో కు విజ్ఞప్తి చేశారు.

మంత్రి కొల్లు రవీంద్రను కలిసిన టీడీపీ వీరాభిమాని



మంత్రిని కలిసిన ఉమ్మలరాజు సుబ్బరాజు

ఓబులవారిపల్లె, జూన్ 22 : ఆ బ్కారీ, గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్రను మండలంలోని విజయవాడలో మర్యాద పూర్వకంగా కలిసినట్లు బొమ్మవరం గ్రామానికి చెందిన టీడీపీ అభిమాని ఉమ్మలరాజు సుబ్బరాజు తెలిపారు. తెలుగు దేశం పార్టీ ఆవిర్భావం నుంచి తమ తండ్రి ఉమ్మల రాజు పిచ్చిరాజు వీరవిధేయులుగా ఉన్నారని, ప్రత్యర్థి పార్టీలు ఎన్ని ఇబ్బందులు పెట్టినా మారకుండా కొనసాగుతున్నామని తెలిపారు. తమ పార్టీ గెలుపొందడంతో ఎన్నో ఏళ్లుగా అనుబంధం ఉన్న తమ అభిమాన నాయకులకు మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు రఘునాథరెడ్డి

రైల్వేకోడూరు, జూన్ 22: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహరెడ్డి, రాష్ట్ర ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి కోరారు. శనివారం రైల్వేకోడూరులోని ఎస్టీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం రైల్వేకోడూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెడ్‌మాస్టర్ కోట వెంకట సుబ్బయ్య పదవీ విరమణ కార్యక్రమానికి నాయకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సుబ్రహ్మణ్యంరాజు, ఆదినారాయణ రెడ్డి, బాలగంగి రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి, హెచ్ అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణ, ఎస్టీయూ నాయకులు బాలసుబ్రహ్మణ్యం, రమణ, కుమార్, మస్తాన్‌బాషా, రామమునిరెడ్డి, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వీరాంజనేయస్వామి తిరుణాల




జాతరలో ఆకట్టుకున్న చాందినీబండి, తిరుణాలకు వస్తున్న భక్తులు

సుండుపల్లె, జూన్ 22: మండల కేంద్రానికి సమీపంలోని తిమ్మసముద్రంలో శనివారం ఉదయం వీరాంజనేయస్వామి తిరుణాల ముగిసింది. మూడు రోజుల నుంచి స్వామి వారికి భక్తులు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మొక్కుబడులు ఉన్న భక్తులు సుమారు 45 బండ్లు కట్టినట్లు స్థానికులు తెలిపారు. గుట్టకాడ బలిజపల్లెకు చెందిన రెడ్డిచర్ల నాగేశ్వర 15 చాందినీ బండ్లు, సాయన్నగారిపల్లెకు చెందిన గడ్డిండ్ల మహేశ్ 12 బండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణలతో చాందినీ బండ్లు దర్శనమిచ్చాయి. పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. విద్యుత్‌శాఖ అధికారులు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించారు.

దానగుణం అలవర్చుకోవాలి



విద్యా సామగ్రిని అందజేస్తున్న మండల టీడీపీ నాయకుడు రెడ్డెప్పరెడ్డి

వీరబల్లి, జూన్ 22: తమకున్న దాంట్లో చేతనైనంత దానం చేసే గుణం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీపీ రాజేంద్ర నాథ్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు రెడ్డెప్పరెడ్డిలు సూచించారు. శనివారం స్థానిక ఉర్దూ పాఠశాలలో రాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎన్నారై దాత హుస్సేన్ ఆర్థిక సహాయంతో విద్యార్థులకు విద్యా సామగ్రితో పాటు ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాటా్లడుతూ పేద విద్యార్థులను ప్రతి ఒక్కరూ ఆదుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని తెలిపారు. దాతలు పేద విద్యార్థులను గుర్తించి సహాయ సహకారాలు అందించాలని కోరారు. దాత హుస్సేన్‌కు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో రాస్ స్వచ్ఛంద సంస్థ ప్రెసిడెంట్ వలిబాషా, టీడీపీ నాయకులు జయచంద్రారెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

రామాపురం, జూన్22: ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలో 7, 8, 9 తరగతుల్లో ఒక్కొక్క సీటు చొప్పున మిగిలిన మూడు సీట్ల భర్తీకి ఈ నెల 24న సోమవారం అర్హులైన విద్యార్థుల నుంచి ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్యామలాదేవి తెలియజేశారు. 24వ తేదీన దరఖాస్తులు స్వీకరించి 26న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

కాణిపాక ఆలయంలో అవకతవకలను ప్రక్షాళన చేయండి


చంద్రబాబును ఆశీర్వదిస్తున్న వేద పండితులు

ఐరాల(కాణిపాకం), జూన్ 22: కాణిపాక వరసిద్ధుడి ఆలయంలో వైసీపీ పాలనలో జరిగిన అవకతవకలను ప్రక్షాళన చేయాలని సీఎం చంద్రబాబు పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో వెంకటేశులను ఆదేశించారు. విజయవాడలోని సీఎం నివాసంలో శనివారం వారు చంద్రబాబును కలసి వేదాశీర్వాదం కల్పించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ వైసీపీ పాలనలో వరసిద్ధుడి ఆలయంలో అనేక అక్రమాలు జరిగాయన్నారు. వాటిని ప్రక్షాళన చేస్తూ సామాన్య భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

భూమి పట్టా ఇప్పిస్తానని వీఆర్‌ఏ మోసం

పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు

పుంగనూరు రూరల్, జూన్22: భూమి పట్టా ఇప్పిస్తానని ఓ వీఆర్‌ఏ డబ్బు తీసుకుని మోసం చేశాడని ఓ మహిళ పుంగనూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె కథనం మేరకు.. మండలంలోని ఏటవాకిలి పంచాయతీ కోళ్లఫారంలో కాపురం ఉన్న బాలాజీ భార్య మంగమ్మకు భూమి పట్టా చేసిస్తానని రామసముద్రం మండలం కేసీపల్లె పంచాయతీకి చెందిన వీఆర్‌ఏ మహ్మద్ నమ్మించాడు. ఆమె నుంచి డబ్బులు తీసుకున్నాడు. భూమి పట్టా ఇవ్వలేదు. దీంతో డబ్బులైనా తిరిగి ఇవ్వాలని నిలదీయడంతో ఆమెపై దాడిచేసి కులంపేరుతో దూషించాడు. ఆమె పోలీసులను ఆశ్రయించింది.

నిత్యాన్నదానానికి రూ.3 లక్షల విరాళం



ఐరాల(కాణిపాకం), జూన్ 22: కాణిపాక ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి తిరుపతికి చెందిన కిశోర్ రెడ్డి శనివారం రూ.3లక్షలు విరాళంగా అందించారు. దాతను ఆలయ ఇన్‌స్పెక్టర్ బాబు స్వాగతించి, దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు, జ్ఞాపిక అందించారు.

తొమ్మిది మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 22: నైరుతి రుతుపవనాల ప్రభావంతో గడిచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా తొమ్మిది మండలాల్లో తేలికపాటి వర్షపాతం నమోదైంది. చిత్తూరు అర్బన్‌లో 18.8మి.మీ., కుప్పం 9.2, చిత్తూరు రూరల్ 9.2, గంగాధరనెల్లూరు 9, విజయపురం 6.2, గుడిపాల 5.4, శాంతిపురం 3.6, గుడుపల్లె 3.4, తవణంపల్లెలో 2.2 మి.మీ నమోదైంది.

తేనెటీగల దాడిలో గాయపడ్డ వృద్ధుడి మృతి


నరసింహారెడ్డి (ఫైల్‌ఫొటో)

వెదురుకుప్పం, జూన్ 22: తేనెటీగల దాడిలో గాయపడిన తిరుమలయ్యపల్లెకు చెందిన వృద్ధుడు శనివారం చనిపోయాడు. తిరుమలయ్యపల్లెకు సమీపంలో ఈనెల 14వ తేదీన (అక్కగార్లు) గ్రామ దేవతకు పూజలు నిర్వహిస్తుండగా ఎవరో తేనెతుట్టెను కదపడంతో ఈగలు నరసింహారెడ్డి(90)పై దాడి చేశాయి. చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారని గ్రామస్తులు తెలిపారు.

టీటీడీ విద్యాసంస్థల్లో స్థానికులకు 50 శాతం సీట్లు కేటాయించాలి

● విద్యార్థి సంఘాల డిమాండ్


మీడియాతో విద్యార్థి సంఘాల నేతలు

తిరుపతి (వైద్యం), జూన్ 22: టీటీడీ విద్యాసంస్థల్లో స్థానిక విద్యార్థులకు 50శాతం సీట్లు కేటాయించాలని భారతీయ దళిత విద్యార్థి సేన అధ్యక్షుడు కొండా యుగంధర్ డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల నేతలతో కలిసి శనివారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. ఇక నిరుపేద విద్యార్థులు కేవలం ప్రభుత్వ బడుల్లో చదువుతారని.. అలాంటి వారికి కార్పొరేట్ పాఠశాలల్లో చదివేవారితో సమానంగా మార్కులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. మెరిట్ ప్రకారం సీట్లు కేటాయిస్తుండటంతో పేద విద్యార్థులంతా ఉన్నత చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై దృష్టి పెట్టాలని కోరారు. ఈ విషయాలపై ఇప్పటికే పలుమార్లు టీటీడీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని చెప్పారు. పైగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న టీటీడీ విద్యాశాఖాధికారికి తక్షణమే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఇకనైనా తగిన చర్యలు తీసుకోకుంటే విద్యార్థి సంఘాలన్నీ ఏకమై టీటీడీ పరిపాలన భవనాన్ని ముట్టడించాల్సి వస్తుందని హెచ్చరించారు. విద్యార్థి సంఘాల నేతలు హేమాద్రి యాదవ్, సుధాకర్ మాదిగ, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల నడకమార్గంలో యువతి అదృశ్యం


విద్య (ఫైల్ ఫొటో)

తిరుమల, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): అలిపిరి కాలినడకమార్గంలో ఓ యువతి కనిపించకుండా పోయినట్టు తిరుమల టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడుకు చెందిన హరిబాబు 15 ఏళ్లుగా కుటుంబీకులతో కలిసి అలిపిరి కాలినడమార్గంలోని గాలిగోపురం వద్ద టిఫిన్ అంగడి నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో హరిబాబు కుమార్తె విద్య (20) బాత్‌రూమ్‌కు వెళ్లింది. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో ఆమెకోసం తల్లిదండ్రులు పరిసర ప్రాంతాల్లో గాలించారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువతి ఆచూకీ తెలిసిన వారు 0877 2263733 నెంబరుకు తెలియజేయాలని పోలీసులు కోరారు.

చట్టంలో మార్పులను న్యాయమూర్తులు గుర్తించాలి

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీమారావు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బీమారావు

చిత్తూరు లీగల్, జూన్ 22: న్యాయ వ్యవస్థలో వస్తున్న మార్పులను న్యాయమూర్తులు, జ్యుడిషియల్ సిబ్బంది గుర్తించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.బీమారావు కోరారు. జిల్లాలోని జ్యుడిషియల్ అధికారులకు అడ్మినిస్ట్రేషన్, న్యూ క్రిమినల్ లా, వివిధ రకాల అంశాలకు సంబంధించి జడ్పీ సమావేశపు హాలులో రెండు రోజుల వర్కుషాపు ఏర్పాటు చేశారు. జడ్జి మాట్లాడుతూ భారతీయ న్యాయశాఖ చట్టం 2023కు పూర్వం ఇండియన్ పీనల్ కోడ్ 1860 ఉండేదని, ఈ చట్టంలో పలు మార్పులు చేశారని తెలిపారు.శిక్షాకాలంతో పాటు జరిమానా పెంచినట్లు చెప్పారు. వీటిపై జిల్లాలోని న్యాయమూర్తులు, అధికారులు అవగాహన పెంచుకోవాలని కోరారు. అనంతరం జిల్లా న్యాయమూర్తిని రీసోర్స్ పర్సన్లు సత్కరించి, జ్ఞాపిక అందించారు. ముందుగా వర్కుషాపును ఆయన న్యాయమూర్తులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రారంభించారు. ప్రొఫెసర్లు కేవీకే శాంతి, శంకర్, న్యాయమూర్తులు రమేష్, శాంతి, వెన్నెల, శిరీష, శ్రీనివాసులు, వాణిశ్రీ, విజయసారథి రాజు, గురు అరవింద్, రాఘవేంద్ర, ఉమాదేవి, మాధవి, షేక్ బాబ్జాన్, కీర్తన పాల్గొన్నారు.

వెంకటాపురంలో తగ్గుముఖం పట్టిన అతిసార

ముమ్మరంగా పారిశుధ్య పనులు - కొనసాగుతున్న వైద్య శిబిరం



వెంకటాపురంలో వైద్య శిబిరం - వెంకటాపురంలో పారిశుధ్య పనులు

గుడుపల్లె, జూన్ 22: మండల పరిధిలోని వెంకటాపురంలో గ్రామంలో అతిసార తగ్గుముఖం పడుతోంది. శుక్రవారం ఈ గ్రామంలో పలువురు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. బాధితులు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. ఎలాంటి ప్రమాదమూ లేదని వైద్యులు ప్రకటించడంతో శనివారం సాయంత్రం వారు ఇళ్లకు చేరుకున్నారు. శనివారం వెంకటాపురంలో గుడుపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పంచాయతీరాజ్ అధికారులు, సర్పంచ్ నారాయణ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు శుద్ధ నీటిని అందించారు. తాగునీటి ట్యాంకును క్లోరినేషన్ చేయించారు.

ఫుడ్ పాయిజన్‌తో మరో ఇద్దరికి అస్వస్థత

పాలసముద్రం, జూన్ 22: పాలసముద్రంలో ఫుడ్ పాయిజన్‌తో శనివారం మరో ఇద్దరు అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలయ్యారు. జాతరలో ఫుడ్ పాయిజనై నాలుగు రోజులుగా 150 మందికి పైగా అస్వస్థతకు గురైన విషయం విదితమే. శనివారం మరో ఇద్దరికి జ్వరం, విరేచనాలు కావడంతో పాలసముద్రం ఆరోగ్యకేంద్రంలో చికిత్స పొందారు. దాదాపు అందరి ఆరోగ్యం మెరుగుపడిందని, ఎలాంటి ఇబ్బందీ లేదని డాక్టర్ మోహన్‌కృష్ణ తెలిపారు.

డయేరియా నివారణలో నిర్లక్ష్యం తగదు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 22: డయేరియా నివారణ విషయంలో నిర్లక్ష్యం తగదని, మెరుగైన వైద్య సేవలను అందించేందుకు వైద్య ఆరోగ్య శాఖ పనిచేయాలని కలెక్టర్ షన్మోహన్ ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. డయేరియాపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జూలై 1 నుంచి ఆగస్టు 31వ వరకు కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ విజయ్‌కుమార్, డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్, జడ్పీ సీఈవో గ్లోరియా, డీపీవో లక్ష్మి, ఐసీడీఎస్ పీడీ నాగశైలజ పాల్గొన్నారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షన్మోహన్

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 23: ఈనెల 25, 26 తేదీల్లో కుప్పంలో సీఎం చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ షన్మోహన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఎస్పీ మణికంఠతో కలిసి ఆయన అధికారులతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ శాఖల వారీగా కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఎలాంటి లోటుపాట్లకూ తావులేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. హెలిప్యాడ్ నుంచి వెళ్లే రూట్‌మ్యాప్‌లను పక్కాగా సిద్ధం చేయాలన్నారు. శాఖల వారీగా ప్రగతి నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్, జిల్లా అధికారులు, ఆర్డీవోలు పాల్గొన్నారు.

సర్వే చలానా కట్టడానికి వెళితే సచివాలయ సిబ్బంది దాడి చేశారు


విలేకరులతో మాట్లాడుతున్న కౌసల్య

పుంగనూరు, జూన్22: భూమి సర్వే నిమిత్తం చలానా కట్టడానికి వెళితే సచివాలయ అధికారి నిరంజన్‌రెడ్డి దాడి చేశారని మండలంలోని ఏతూరు పంచాయతీ చిన్న నెల్లూరుపల్లె నివాసి కౌసల్య ఆరోపించారు. బాధితురాలి వివరాల మేరకు... చిన్న నెల్లూరుపల్లె నివాసి సీతారామయ్య తన కుమార్తె ధనలక్ష్మికి సర్వే నెంబర్ 248/6లో 0.43సెంట్లు రాసిచ్చాడు. అయితే ఈ భూమి గ్రామానికి చెందిన సుబ్బిరెడ్డికి చెందిందిగా వీఆర్వో రత్నప్ప చెప్పడంతో ఆ స్థలంలో భవన నిర్మాణానికి ప్రయత్నం చేశారు. ధనలక్ష్మికి ఆరోగ్యం సహకరించకపోవడంతో ఆమె కుమార్తె కౌలస్య కోర్టుకు వెళ్లి స్టే ఆర్డర్, ఇంజెక్షన్ తీసుకొచ్చింది. తహసీల్దార్‌ను కలసి ఆర్డర్‌ను చూపడంతో సర్వే చేయించుకోవాలని, సచివాలయంలో నగదు చెల్లించాలని సూచించారు. దీంతో కౌసల్య సర్వే చలానా కట్టడానికి వెళితే సచివాలయ ఉద్యోగి నిరంజన్‌రెడ్డి దురుసుగా ప్రవర్తించడంతో పాటు గ్రామానికి చెంది న భార్గవ్‌రెడ్డితో మాట్లాడంటూ బెదిరించాడు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళితే పోలీసులు ఫిర్యాదు తీసుకోలేదని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరింది.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.39 కోట్లు

తిరుమల, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.39 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 72,294 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 31,855 మంది తలనీలాలు సమర్పించారు.

భక్తజన సంద్రంగా ముక్కంటి ఆలయం


ముక్కంటి ఆలయం వద్ద క్యూలైన్లలో భక్తులు

శ్రీకాళహస్తి, జూన్ 22: శ్రీకాళహస్తీశ్వరాలయం శనివారం భక్తజన సంద్రంగా మారింది. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 30వేలమంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించు కున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇందులో రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,994మంది, రూ.50 టిక్కెట్ల ద్వారా 3,040మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 టిక్కెట్ల ద్వారా 2,879మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,322, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 341మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 315మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 69 మంది భక్తులు రాహుకేతు పూజలు చేయించు కున్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 20,589 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

శాస్త్రోక్తంగా వసంతోత్సవం


దేవదేవుడిపై పసుపు నీళ్లు చల్లుతూ గోవింద నామాలు పఠించారు.

వడమాలపేట, జూన్ 22: అప్పలాయగుంట ప్రసన్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో శ్రీనివాస కల్యాణమైన మూడవ రోజు సోమవారం శాస్త్రోక్తంగా వసంతోత్సవాన్ని నిర్వహించారు. పద్మావతీ, అండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వరుడికి పట్టువస్త్రాలు ధరింప జేసి మంగళవాయిద్యాలు, వేద మంత్రాల పఠిస్తూ సూర్యకుమారాచార్యులు, కంకణ భట్టార్ తిప్పయ్య చార్యులు శాస్త్రోక్తంగా వసంతోత్సవాన్ని నిర్వహించారు. పద్మావతీ అండాల్ సమేతంగా నూతన వధూవరు లుగా ప్రసన్న వెంకటేశ్వరుడు మాడ వీధుల్లో విహరిం చారు. అర్చకులు ఉభయ దేవేరులతో

హనుమంత, గజ వాహనాలపై అభయహస్తాధీశుడి అభయం



హనుమంతు, గజ వాహనాలపై వెంకటేశ్వరుడు

వడమాలపేట, జూన్ 22: అప్ప లాయగుంట ప్రసన్న వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం హనుమంత వాహనం, గజ వాహనాలపై విహరిస్తూ భక్తులకు అభయమి చ్చారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. అనంతరం భక్తుల్లో అగ్రగణ్యుడైన హనుమంతు డిని వాహనంగా చేసుకుని కోదండ రాముడి అలంకరణలో మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. అలసిన ఉభ యనాంచారులతో స్వామివారికి స్నపన తిరుమంజనం గావించారు. రాత్రి గజ వాహనరూఢుడైన ప్రసన్న వెంకటేశ్వరుడు మంగళవాయిద్యాల నడుమ మాడ వీధుల్లో ఊరేగారు. భక్తులు నారికేళ, కర్పూర నీరాజ నాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



గోపూజలో హోంమంత్రి

శ్రీవారి దర్శనార్థం రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత శనివారం రాత్రి తిరుమలకొచ్చారు. అంతకుముందు అలిపిరిలో సప్తగోప్రదక్షిణ మందిరానికి వెళ్లిన ఆమె వేణుగోపాలస్వామిని దర్శించుకుని గోపూజలో పాల్గొన్నారు. తర్వాత గోవులకు గ్రాసం అందించారు.మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇక్కడ సంప్రదాయబద్ధంగా గోపూజ చేయడం చాలా సంతోషకరమన్నారు.సీఎం చంద్రబాబు సమర్థ నాయకత్వంలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



నాట్య నీరాజనం

తిరుపతికి చెందిన సిటిజన్ వెల్ఫేర్ ఫోరం, ప్రైడ్ ఇండియా కల్చరల్స్ సంయుక్త నిర్వహణలో శనివారం మహతి కళావేదికలో జరిగిన అయోధ్య రాముడికి నాట్యనీరాజనం కార్యక్రమం కళాభిమానులను అలరించింది.చిన్నారులు మొదలుకుని పెద్దల వరకు నృత్య కళాకారులు జానపద, సంప్రదాయ ప్రదర్శనలిచ్చారు. ఆదివారం కూడా ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నాట్యనీరాజనం కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు ఎం.జి. బాలాజి, కోలా వెంకటేశ్వరరావు తెలిపారు.

- తిరుపతి కల్చరల్

రేణిగుంట- శ్రీకాళహస్తి రైల్వే సెక్షన్‌లో డీఆర్‌ఎం తనిఖీలు



తిరుపతి(సెంట్రల్), జూన్ 22: రేణిగుంట-శ్రీకాళహస్తి రైల్వే సెక్షన్‌లో శనివారం దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ డివిజన్ మేనేజరు (డీఆర్‌ఎం) వినీత్ సింగ్ తనిఖీలు చేశారు. రేణిగుంట నుంచి తిరుమలకు వెళ్లిన ఆయన శ్రీవారి దర్శనానంతరం శ్రీకాళహస్తికి చేరుకున్నారు. రైల్వేస్టేషన్‌కు వెళ్లి ప్రయాణికులకు కల్పిస్తున్న మౌలిక వసతులను పరిశీలించారు. అక్కడ జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఎల్‌సీ గేట్ 27 వద్ద ఆగి గేట్‌మెన్ పనితీరును, నిర్వహణను గమనించారు. అలాగే రేణిగుంట రైల్వే స్టేషన్‌లోని యార్డును పరిశీలించి, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సూచనలిచ్చారు.

ఖరీఫ్ సాగుకు రైతన్న సిద్ధం

రామసముద్రం, జూన్ 22: రామసముద్రం మండలంలో ఖరీఫ్ పంట సాగుకు రైతన్న సిద్ధమవుతున్నాడు. ప్రతి ఏడాది ఆలస్యంగా వస్తున్న నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది ఖరీఫ్‌లో ముందుగా రావడంతో రైతుల్లో ఆశలు రేకెత్తించాయి. వర్షాలు కూడా సకాలంలో కురుస్తుండడంతో రైతులు ఏరువాక సాగుకు నడుం బిగించారు. ఈమేరకు 2024 ఖరీఫ్ సాగుకు రైతన్నలకు అవసరమైన విత్తనాలు, ఎరువులు పురుగు మందులు, యంత్ర పరికరాలు తదితర వాటిని సకాలంలో అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే వ్యవసాయ అధికారులు సబ్సిడీ ధరతో రైతులకు అవసరమైన వేరుశనగ విత్తన కాయలు, ఎరువులు అందించడంతో పాటు నాణ్యమైన విత్తనాలు అందేలా చర్యలు తీసుకున్నారు. దీనికి తోడు నూతనంగా అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం అన్నదాతలకు వెన్నుదన్నుగా నిలవాలని రైతన్నలు కోరుకున్నారు. గత పదిరోజులుగా పొలాల్లో విత్తనాలు వేసుకుంటూ రైతులు బిజీ బిజీగా ఉంటున్నారు. రామసముద్రం మండలంలో ఎలాంటి నదీ పరివాహక కాలువలు, ప్రాజెక్టులు లేవు. వర్షాల మీదే ఆధారపడి రైతులు వ్యవసాయం చేస్తున్నారు. వర్షాలు ఈ మూడు నెలల పాటు బాగా కురిస్తే మంచి దిగుబడి రావాలని రైతులు కోటి ఆశలతో పంట సాగుకు సన్నద్ధమవుతున్నారు. వారి ఆశలు, ఆశయాలను వరుణుడు నెరవేర్చాలని ఆశిద్దాం.


దుక్కులు చేస్తున్న రైతులు

మద్యం మత్తులో భార్యను కడతేర్చిన భర్త

కురబలకోట జూన్22: అగ్నిసాక్షిగా పెళ్లాడిన భార్యను మద్యం మత్తులో భర్త కడతేర్చిన విషాధకరణ సంఘటన మండలంలో జరిగింది. దీనికి సంబందించి పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పిచ్చిలవాండ్ల పల్లె పంచాయతీ లక్కసముద్రానికి చెందిన లక్ష్మణరెడ్డి మద్యానికి బానిసై నిత్యం మద్యం తాగి ఇంటిల్లో భార్యతో తరచూ గొడవపడేవాడు. అతని భార్య రమణమ్మ(45) వ్యవసాయం చేస్తూకుంటూ జీవనం సాగిస్తుండేవారు. ఈ నేపథ్యంలో మూడు రోజులు క్రితం ఇంటిలోని పెంచుకుంటున్న మూడు నాటుకోళ్లు చనిపోయాయి. దీంతో ఆ కోళ్లను భార్య రమణమ్మ పారేసింది. ఈ నేపథ్యంలో కోళ్ల చనిపోయిన విషయం తెలుసుకున్న ఆయన భార్యతో తర చూ గొడవ పడుతున్నారు. శుక్రవారం రాత్రి ఫుల్‌గా మద్యం తాగి భార్యతో గొడవ పడ్డాడు. ఆమె ఏమాత్రం అతనితో మాట్లాడటానికి నిరాకరించింది. దీంతో కోపం చెందిన ఆయన ఆమెను అతికిరాతకంగా కొడవలితో నరికి హత్య చేశాడు. కాగా మృతురాలికి ఒక కుమారుడు ఉన్నాడు. స్థానికులు హత్య జరిగిన విషయాన్ని ముదివేడు పోలీసులకు సమాచారం అందించారు. దీం తో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా పోలీసులు డాగ్‌స్క్వాడ్‌ను రంపించి తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు నిందితుడ్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.మృతురాలి బంధువు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ములకలచెరువు పోలీస్‌స్టేషన్ తనిఖీ


రికార్డులు తనిఖీచేస్తున్న డీఎస్పీ ప్రసాదరెడ్డి

ములకలచెరువు, జూన్ 22: ములకలచెరువు పోలీస్‌స్టేషన్‌ను శనివారం మదనపల్లె డీఎస్పీ ప్రసాదరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి పలు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామాల్లో ప్రశాంతతకు భంగం కలిగించే వారు ఎంతటి వారైనా వదలి పెట్టమన్నారు. గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తే తమకు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. ఈ తనిఖీల్లో సీఐ మధు, సెట్ సీఐ రామ్మోహన్, ఎస్ఐ తిప్పేస్వామి పాల్గొన్నారు.

కల్యాణ వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం


వేంకటేశ్వరస్వామి ఆలయం

రామసముద్రం, జూన్ 22: రామసముద్రం మండలం మినికి గ్రామంలో వెలసిన కల్యాణ వెంకటరమణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. ఆదివారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీధర్‌భట్టార్ తెలిపారు. ఉదయం అభిషే కం, మహా మంగళహారతి, రాత్రి 7గంటలకు అంకురార్పణ, ధ్వజారో హనం నిర్వహించనున్నట్లు చెప్పారు. 24న కళశారాధన, హోమం, రాత్రి స్వామి వారికి కల్యాణోత్సవం, 25న ఉట్లోత్సవం అన్నదానం, 26న దీపోత్సవం పుష్పపల్లకి, పైరాణిక నాటకం 27న ఉదయం వసంతోత్సవం, చక్రస్నానం, సాయంత్రం ధ్వజావరోవహనం శయనోత్సవం ఉంటుందని తెలిపారు.

భూమకంవారిపల్లెలో చెన్నకేశవ ఉత్సవాలు

మదనపల్లె అర్బన్, జూన్ 22: మండలంలోని భూమకంవారిపల్లెలో చెన్నకేశవస్వామి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొల్పి ప్రత్యేకంగా అభిషేకాలు, అర్చనలు, విశేషపూజలు హోమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణం జనసందోహంతో ఉత్సవాల సందడి నెలకొంది. ఆదివారం గ్రామంలో స్వామివారి ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ సభ్యులు పేర్కొన్నారు.

తంబళ్లపల్లెలో టీడీపీని బలోపేతం చేస్తాం


టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లాశ్రీనివాస్‌ను కలసిన పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు సురేంద్రయాదవ్

మదనపల్లె టౌన్, జూన్ 22: తంబళ్లపల్లె నియోజకవర్గంలో టీడీపీని బలోపేతం చేస్తామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ తో టీడీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్ తెలిపారు. శనివారం విజయవాడలోని పల్లా శ్రీనివాస్‌ను టీడీపీ బీసీ విభాగం నాయకులతో కలసి సురేంద్రయాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన అన్నమయ్య జిల్లాలో ఉన్న బీసీలు ఈ సారి ఎన్నికల్లో ఉమ్మడి కూటమి అభ్యర్థుల గెలుపుకు కృషి చేశారని తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేసిన వారికి తగిన గుర్తింపు ఇవ్వాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో నాగరాజ, మనోహర్‌నాయుడు, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యకు అంబేడ్కర్ పేరు పునరుద్ధరణ హర్షణీయం


సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల ధరణీ కుమార్

పీలేరు, జూన్ 22: విదేశీ విద్య పథకానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరును ప్రభుత్వం పునరుద్ధరించడం హర్షణీయమని పీలేరులోని మాలమహానాడు నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. పీలేరులో శనివారం జరిగిన విలేఖరుల సమావేశంలో మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గసభ్యులు తుమ్మల ధరణీ కుమార్ మాట్లాడుతూ విదేశీ విద్య పథకానికి గత ప్రభుత్వం అంబేడ్కర్ పేరును తొలగించడం దురదృష్టకరమని, కొత్త ప్రభుత్వం ఆ తప్పును సరిదిద్దడం సంతోషకరమన్నారు. అదే విధంగా గత ప్రభుత్వంలో నిర్వీర్యమైపోయిన ఎస్సీ సంక్షేమ పథకాలు, ఎస్సీ కార్పొరేషన్, సబ్-ప్లాన్ నిధులను పునురుద్ధరించి రాష్ట్రంలోని ఎస్సీల అభివృద్ధిని మళ్లీ గాడిలో పెట్టాలని ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆనంద్, రవి పాల్గొన్నారు.

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

గుర్రంకొండ, జూన్ 22:గుర్రంకొండ మండలం తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలను చేశారు. స్వామి వారికి అభిషేకాలను చేయించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంచముఖ ఆంజనేయస్వామికి విశేష పూజలు



కలకడ, జూన్ 22:మండలంలోని బాటవారిపల్లెలో కొలువైన పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి విశేష పూజలను చేశారు. ఈ సందర్భంగా వేకువ జామునే స్వామి వారికి అభిషేకం, ఆకుపూజ కార్యక్రమాలను నిర్వహించి అనంతరం ప్రత్యేక అలంకరణ చేసి నైవేద్యం సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి స్వామిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

గుంతలపేట వీరాంజనేయస్వామికి పౌర్ణమి పూజలు



రామసముద్రం, జూన్ 22: రామసముద్రం మండలం గుంతలపేటలోని ప్రముఖ పురాతన వీరాంజనేయస్వామి ఆలయంలో పౌర్ణమి వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో చలువ పందిళ్లు వేసి, మామిడి తోరణాలు కట్టి పలు రకాల పుష్పాలతో ఆలయ ప్రాంగణం ముస్తాబు చేశారు. స్వామివారికి ఉదయం ప్రత్యేక అభిషేకాలు అర్చనలు, విశేషాలంకరణలు చేసి భక్తులకు స్వామి దర్శనం కల్పించారు. స్వామివారి ఆలయాలలో కోలాట, భజనలు, రామకీర్తనలు, హరికథ నాటకాలు ఘనంగా నిర్వహించారు.

బోయకొండ గంగమ్మ ఆలయంలో అన్నదానం

మదనపల్లె అర్బన్, జూన్ 22: పట్టణంలోని అన్నమయ్య సర్కిల్ సమీపంలోని బోయకొండ గంగమ్మ ఆలయంలో పౌర్ణమి పురస్కరించకుని శ్రీరామ రజకసంఘం అధ్యక్షుడు కె.వెంకటరమణ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. అంతకముందే గంగమ్మకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు పూజలు చేశారు. పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మహిళలు అమ్మవారికి పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో నాగరాజ, లక్ష్మీదేవి, చిన్నమ్మ, ఈశ్వరమ్మ, వేణు, నారాయణ, చలపతి, శ్రీనివాసులు, హేమలత, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ రూములకు వేలంపాటలు


వేలంపాటలు నిర్వహిస్తున్న కమిషనర్ కె.ప్రమీల

మదనపల్లె, జూన్ 22: మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న 51 షాపు రూములకు వేలంపాటలు నిర్వహించగా, అందులో ఆరు రూములను లబ్ధిదారులు వేలంపాట పాడుకున్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కె.ప్రమీల అధ్యక్షతన శనివారం నిర్వహించిన వేలం పాటలో 15 మంది ఔత్సాహికులు పాల్గొన్నారు. ఇందులో రిజర్వేషన కేటగిరి, అద్దె అంశాల వారీగా తీసుకుంటే హెచ్చు వేలంపాట పాడిన వారికి గదులు దక్కాయి. మిగిలిన మరో 36 రూములకు మరోవిడత వేలం నిర్వహించనున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఆర్వో నాగేశ్వరరావు, ఆర్ఐలు నాగరాజ, రెడ్డిమస్తాన్‌లు పాల్గొన్నారు.

అలరించిన మహాభారతం నాటకాలు

మదనపల్లె అర్బన్, జూన్ 22: స్థానిక నీరుగట్టువారిపల్లె సమీపంలోని టిప్పుసుల్తాన్ మైదానంలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా శుక్రవారం రాత్రి నిర్వహించిన నాటకాలు ప్రజలను అలరించాయి. వృద్ధులు, మహిళలతోపాటు అధిక సంఖ్యలో భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తు

వాల్మీకిపురం, జూన్ 22: వాల్మీకిపురం పట్టణ సమీపంలోని ఏపీ మైనార్టీ బాలికల పాఠశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.నవమల్లిక పేర్కొన్నారు. పాఠశాలలో పీఈటీ పోస్టుకు బీపీఈడీ, మ్యాథ్స్ పోస్టు కొరకు మ్యాథ్స్ బీఈడీ,పీజీ మ్యాథ్స్, కంప్యూటర్ ఆపరేటర్ పోస్టుకు డిగ్రీ పూర్తి చేసి కంప్యూటర్ సైన్స్ నందు అనుభవం కలిగి ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థులు సెల్ ఫోన్ నెంబరు 8712625052 ను సంప్రదించాలన్నారు.

రేపు బి.కొత్తకోట మండల మీట్

బి.కొత్తకోట, జూన్22: బి.కొత్తకోట మండల సర్వసభ్య సమావేశం ఈ నెల24 న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నూర్జహాన్ తెలిపారు. ఎంపీపీ లక్ష్మీనరసమ్మ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని అందరు ఎంటీసీలు, సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు అందరూ హాజరు కావాలని ఆమె కోరారు. అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలన్నారు.

కొనసాగుతున్న టీడీపీ శ్రేణుల సంబరాలు


కేక్ కట్ చేస్తున్న పీలేరు తెలుగు మహిళా శ్రేణులు

పీలేరు, జూన్ 22: పీలేరు ఎమ్మెల్యేగా నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి శాసనసభలో ప్రమాణస్వీకార సంబరాలు శనివారం కూడా కొనసాగాయి. తెలుగు మహిళా నాయకురాలు పురం రెడ్డమ్మ ఆధ్వర్యంలో తెలుగు మహిళా శ్రేణులు, టీడీపీ నాయకులు స్థానిక తిరుపతి రోడ్డులో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పురం రెడ్డమ్మ మాట్లాడుతూ పదేళ్ల సుదీర్ఘ నిరీక్షణ తరువాత లభించిన పదవితో నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి, టీడీపీ శ్రేణులపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం, కిశోర్ ఆధ్వర్యంలో పీలేరు వచ్చే ఐదేళ్లు అభివృద్ధి పథంలో పయనిస్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు పురం రామ్మూర్తి, లక్ష్మీకాంతమ్మ, రెడ్డిరాణి, స్వర్ణలత ఖాదర్ బాషా, చందన, స్వర్ణ, సుశీలమ్మ, రత్నమ్మ, షమ, వాణి, సురేశ్, బాబ్జీ, ఆంజి, మల్లి, అమానుల్లా, హరీశ్, షఫీ, రియాజ్, నాగేంద్ర, హరి, శివ, ధన, మహబూబ్ బాషా, అశోక్, మహేశ్, చందు, టీచర్ నాగయ్య, పీవీ రమణ, సూరి, తదితరులు పాల్గొన్నారు.

రవినాయక్ పై దాడి కేసులో విచారణ చేయాలి


వడ్డివంకతాండలో తాండవాసులతో మాట్లాడుతున్న విశ్వనాధనాయక్ తదితరులు

పెద్దమండ్యం, జూన్ 22: పెద్దమండ్యం మండలం దిగువపల్లి గ్రామ పంచాయతీ వడ్డివంకతాండకు చెందిన రవినాయక్ పై దాడి కేసులో నిజనిజాలను పోలీసు ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్వనాధనాయక్, జిల్లా దళిత హక్కుల పోరాట సమితి ప్రధాన కార్యదర్శి సుధీర్‌కుమార్ డిమాండ్ చేశారు. పెద్దమండ్యం మండలం లోని వడ్డివంకతాండలో శనివారం పర్యటించి రవినాయక్ కుటుంబ సభ్యులకు పరామర్శించి తాండవాసులతో మాట్లాడారు. ఈ నెల 13వ తేదీ దిగువపల్లిలో జరిగిన పరస్పరదాడులు కేసులో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించిన విషయం తెలిసిందే. రవినాయక్ తల్లి శాంతమ్మ ఫిర్యాదు మేరకు జయమ్మ, రమణరెడ్డిలపై కేసు నమోదు చేయగా, జయమ్మ ఫిర్యాదు మేరకు రవినాయక్‌పై కేసు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ దాడుల్లో రవినాయక్ తలకు తీవ్ర గాయాలై ఆసుపత్రి లో చికిత్స పొందుతున్నాడని తెలిపారు. ఈ ఘటన పై పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధిత రవినాయక్ కు న్యాయం చేయాలని గిరిజన నాయకులు కోరారు.

మంత్రి సవితమ్మను కలసిన టీడీపీ నేతలు


మంత్రికి జ్ఞాపికను అందజేస్తున్న శ్రీరాంచినబాబు, బొమ్మనచెరువు

మదనపల్లె, జూన్ 22: మదనపల్లెకు చెందిన టీడీపీ నేతలు మంత్రి సవితమ్మను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీరామ్‌చినబాబు, టీడీపీ సీనియర్ నేత బొమ్మనచెరువు శ్రీరాములు వేర్వేరుగా కలిశారు. పెనుగొండ ఎమ్మెల్యేగా ఎన్నికైన సవితమ్మ.సంక్షేమ, చేనేత, జౌళిశాఖమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సచివాలయంలో కలసి జ్ఞాపిక, పుష్పగుచ్ఛం అందజేసి వారు మంత్రిని అభినందించారు.

మంత్రి మండిపల్లికి శుభాకాంక్షలు తెలిపిన నేతలు


మంత్రి మండిపల్లిని కలసిన తంబళ్లపల్లి నియోజకవర్గ నాయకులు

పెద్దమండ్యం, జూన్ 22: సార్వత్రిక ఎన్నికలలో కూటమి ఘన విజయం సాధించి రాష్ట్ర మంత్రిగా పదవి చేపట్టిన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని తంబళ్లపల్లి టీడీపీ నేతలు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సార్వత్రిక ఎన్నికలలో ఎన్‌డీఏ కూటమి ఘన విజయ సాధించిన మంత్రి పదువులు చేపట్టిన సందర్భంగా అమరావతిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో శనివారం కలసి పుష్పగుచ్చాలు ఇచ్చి దుశ్శావలువలతో సన్మానించారు. కార్యక్రమంలో తంబళ్లపల్లి నియోజక వర్గం టీడీపీ ప్రచార కార్యదర్శి సీడ్ మల్లికార్జున, పెద్దమండ్యం మండల మాజీ ఎంపీపీ రజనీదత్, టీడీపీ మాజీ అధ్యక్షుడు సిద్దవరం ప్రసాద్, ఉమ్మడి చిత్తూరు జిల్లా టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కాలేషా, దత్తాత్రేయరెడ్డి, నాగరాజా, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యశాఖ మంత్రికి కూటమి నేతల వినతి


మంత్రి సత్యకుమార్‌ను సన్మానించిన కూటమి నేతలు

పెద్దమండ్యం, జూన్ 22: రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను పెద్దమండ్యం మండల కూటమి నేతలు కలిసి సమస్యలు పరిష్కరించాలంటూ వినతి పత్రం అందజేశారు. శనివారం అమరావతిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో మంత్రిని కలిసి పెద్దమండ్యంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వినతి పత్రంలో కోరారు. అలాగే ప్రభుత్వాసుపత్రిలో గైనకాలజిస్ట్ పోస్టు మంజూరు చేయాలని అయూష్ కొత్త భవనం, ఆసుపత్రి ప్రహరీ తో పాటు కొత్త హెల్త్ సెంటర్‌ల భవనాల నిర్మాణాలు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు కూటమి నాయకులు వెల్లడించారు. అంతకు ముందు మంత్రిని కలసి పుష్పగుచ్చాలు ఇచ్చి దుశ్శావలువలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దమండ్యం మండల కూటమి నేతలు దత్తాత్రేయరెడ్డి, సిద్దవరం ప్రసాద్, నాగరాజా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం ఏడు బడి బస్సులు ఏర్పాటు


గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న వన్ డిపో మేనేజరు

మదనపల్లె అర్బన్, జూన్ 22: విద్యార్థుల సౌకర్యం కోసం ఆర్టీసీ పరిధిలో ఏడు బడి బస్సులు నడుపుతున్నట్లు వన్ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఆర్టీసీ ఉద్యోగులతో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థుల కోసం ఏడు రూట్లలో బడి బస్సులు నడుపుతున్నామన్నారు. ఇందులో భాగంగా మదనపల్లె-బికొత్తకోటకు, మదనపల్లె నుంచి కోసువారిపల్లెకు, కోసువారిపల్లె నుంచి వయా కురబకోట మదనపల్లెకు, మదనపల్లె నుంచి వయా బురకాయకోట మీదుగా బి.కొత్తకోటకు, మదనపల్లె నుంచి ముద్దనొడ్డికి, మదనపల్లె - మిట్టామర్రికి, బి కొత్తకోట నుంచి అంకిరెడ్డిపల్లె మీదుగా కందుకూరుకు, బి.కొత్తకోట నుంచి మదుమూరుకు నడుపుతున్నట్లు తెలిపారు. బస్సుపాస్ కోసం విద్యార్థులు తమ స్టడీ సర్టిఫికేట్స్, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలుతో ఫ్రీ బస్సుపాసులు, రాయితీ పాసులు ఇంటి నుంచి కాలేజీ ఉన్న వరకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 21 వరకు వన్ డిపో ఓఆర్ 71 శాతం సాధించి రీజనల్‌లో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. అలాగే ఈపీకే 38.49, కేఎంపీఎల్ 5.38 సాధించి రీజియన్‌లోనే రెండవ స్థానంలో ఉన్నామన్నారు. ఇందుకు ఆర్టీసీ ఉద్యోగులకు అభినంద నలు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు రేవతి, ఎంఎఫ్ రవి, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ పారదర్శకంగా నిర్వహించాలి


సామాజిక తనిఖీ బృందానికి సూచనలిస్తున్న ఎంపీడీవో భానుప్రసాద్

మదనపల్లె టౌన్, జూన్ 22: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో నిర్వహించిన పనులను సామాజిక తనిఖీ బృందం పారదర్శకంగా పరిశీలించాలని ఎంపీడీవో భానుప్రసాద్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో సామాజిక తనిఖీ బృందం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 2023-24 సంవత్సరంలో మండలంలో 3,263 ఉపాధి పనులకుగాను రూ.4,36,28,076 వేతనాలు అందించామన్నారు. దీంతో పాటు సామగ్రిరూపంలో రూ.3,79,18,703 ఖర్చు చేశామన్నారు. హౌసింగ్ పథకంలో లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణం, గ్రామ సచివాలయాల నిర్మాణాలు, పళ్లతోటల పెంపకాలను ఉపాధి పనుల్లో చేపట్టామన్నారు. సామాజిక తనిఖీ బృందం ప్రతి పనిని క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో జరిగిన పనులను, రికార్డులను పరిశీలించి నివేదికలు అందజేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీవో సుబ్రమణ్యం, ఎస్ఆర్‌పీ మూర్తి, పీఆర్ ఏఈ వెంకటరమణ, డీఆర్‌పీలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆయిల్ సీడ్స్‌లోని అక్రమ నిర్మాణాలు తొలగించండి


మాట్లాడుతున్న సాంబశివ

పీలేరు, జూన్ 22: పీలేరు ఆయిల్ సీడ్స్ ప్రాంగణంలో జరిగిన అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని సీపీఐ జిల్లా కార్య వర్గసభ్యుడు సాంబశివ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీలేరులో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో ప్రభు త్వ భూముల ఆక్రమణలు, వైసీపీ నాయకుల అక్రమాలపై పోరాడిన నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందడం సంతోషకర మన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో పీలేరు ఆక్రమణలు, అక్రమాలపై ఉక్కుపా దం మోపి అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఎమ్మెల్యే కిశోర్ కుమార్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. అదే విధంగా పీలేరు పట్టణంలో నత్తనడక న సాగుతున్న ఫ్లైఓవర్ల నిర్మాణాలు వేగవంతం అయ్యేలా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు నరసింహులు, టీఎల్ వెంకటేశ్, శ్రీనివాసులు, మురళీ, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మారినా.. అధికారుల తీరు మారదా..?



వాల్మీకిపురం ఇందిరమ్మ కాలనీలో విలేజ్ క్లీనిక్ కేంద్రంపై జగన్ చిత్రాలు
4వ సచివాలయంపై జగన్ ఫొటో

వాల్మీకిపురం, జూన్ 22: రాష్ట్రంలో ప్రభుత్వం మారినప్పటికీ వాల్మీకిపురం మండలంలో అధికారుల తీరు మాత్రం మారడం లేదు. కొత్త ప్రభుత్వం అధికారం చేపట్టినా స్థానిక అధికారులు గత ప్రభుత్వ పథకాలపై ఏర్పాటు చేసిన చిత్రాలను ముఖ్యంగా గత సీఎం జగన్ బొమ్మలను తొలగించకపోవడం పట్ల పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద గత వైసీపీ ప్రభుత్వం ఆనవాళ్లను తొలగించలేదు. అలాగే ఇందిరమ్మ కాలనీలో, బైపాస్ రోడ్డులోని విలేజ్ క్లీనిక్ కేంద్రాల వద్ద కూడా జగన్, వైఎస్ఆర్ చిత్రాలే దర్శనమిస్తుండడం గమనార్హం. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట వైసీపీ జెండా దిమ్మెని తొలగించకపోవడం గమనార్హం. ప్రభుత్వ కార్యాలయాలలో సీఎం, డిప్యూటీ సీఎంల చిత్ర పటాలు నేటికీ ఏర్పాటు చేయలేదన్న విమర్శలు చోటుచేసుకుంటున్నాయి. ఈ విషయమై వాల్మీకిపురం ఎంపీడీవో సుధాకర్‌రెడ్డిని వివరణ కోరగా త్వరలోనే సమస్య పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.